అరాచకం పోవాలి.. చంద్రన్న రావాలి...

'బాబుతో నేను'లో టీడీపీ రాష్ట్ర పార్టీ కార్యదర్శి గొంప క్రిష్ణ

విశాలాంధ్ర-శృంగవరపుకోట: అరాచకం పోవాలి.. చంద్రన్న రావాలని, ప్రతి ఒక్కరూ చంద్రబాబు నాయుడుని మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ కోరారు. తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ ఆదేశాల మేరకు రాయవరపు చంద్రశేఖర్ (విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు), మండా త్రినాథ్ (మామిడిపల్లి పార్టీ ప్రెసిడెంట్) ఆధ్వర్యంలో "బాబుతో నేను" ర్యాలీని మామిడిపల్లి గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించారు. అనంతరం గొంప క్రిష్ణ ఇంటింటికీ తిరిగి చంద్రబాబు అక్రమ అరెస్టు, కక్ష సాధింపు చర్యల గురించి ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలు, వైకాపా ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అరాచక పాలన పోవాలి.. చంద్రన్న పాలన రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని గొంప వ్యాఖ్యానించారు. సంకెళ్లు వేసుకోవలసిన వాళ్ళు రాజ్యాన్ని పరిపాలిస్తున్నారని, రాష్ట్రాన్ని బంగారు బాటలో నడిపించే మన నాయకుడిని రాజమండ్రి సెంట్రల్ జైల్లో అక్రమ అరెస్టు చేసి మన ఆంధ్ర రాష్ట్రానికి సంకెళ్లు వేశారని ఆందోళన వ్యక్తం చేశారు. కావున ఆంధ్ర రాష్ట్రంలో ప్రతి పౌరుడు మేల్కొని మన ఆంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తు కోసం 2024లో మనందరం యుద్ధానికి సిద్ధం కావాలని... న్యాయాన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు లగుడు రవికుమార్, రాయవరపు చంద్రశేఖర్, జుత్తాడ రామసత్యం, ఇప్పాక త్రివేణి, మాదిబోయిన మంగరాజు, ఆడారి ఉమామహేశ్వరరావు, లగుడు ఎర్రినాయుడు, గనివాడ సన్యాసినాయుడు, కోరుకొండ శ్రీనివాస్ రావు, మండా త్రినాథ్, సిమ్మ అప్పారావు, దండుపాటి ఎర్రినాయుడు, బాదిరెడ్డి సన్యాసినాయుడు పాల్గొన్నారు.

ఉపాధి చెల్లింపులలో అంతా సవ్యమే

విశాలాంధ్ర-జామి: మండలంలోని గత ఆర్థిక ఏడాదికి సంభందించి ఉపాధి హామీ పథకంలో చెల్లింపులు, పనుల నిర్వహణ అంతా సక్రమంగానే జరిగినట్లుగా అధికారులు తేల్చారు. గతకొద్ది రోజులుగా గ్రామ స్థాయిలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈమేరకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజా తనిఖీ వేదికను నిర్వహించారు. ఈసందర్భంగా ఆడిట్ చేసిన బృందాలు తాము గ్రామాలలో పర్యటించిన సమయంలో అభ్యంతరాలను వేదికలో అధికారుల ముందు పెట్టారు. ఎపిడి, ఈ ప్రజావేదికకు ప్రిసైడింగ్ అధికారిగా ఉన్న టి.జనార్ధన్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో ఎంపిపి ఎస్.అ.రుణ, జెడ్పిటిసి గొర్లె సరయు, మండల వైసీపీ కన్వీనర్ గొర్లె రవికుమార్, ఎస్‌కోట ఎపిడి ఎస్.శారధాదేవి, డివిఓ ఎస్.రవీంద్ర, ఎంపిడివో ఎం.సతీష్, పిఆర్‌డిఇ నాయుడు, ఎస్ఆర్‌పి ఎస్.మాధవ్‌రావు, ఎపివోలు శేఖర్, కిరణ్మయిలు హాజరయ్యారు. చిన్న చిన్న అంశాలు తప్ప పెద్దగా ఏగ్రామంలోనూ తప్పులు జరగలేదని నిర్ధారించారు. సాంకేతిక కారణాల నేపధ్యంలో కొన్ని ఇబ్బందులు క్షేత్రస్థాయిలో ఉన్నాయని అంగీకరించారు.

చంద్రబాబు కడిగిన ముత్యంలా వస్తారు

విశాలాంధ్ర-కొత్తవలస: టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు అక్రమ కేసులో కడిగిన ముత్యంలా వస్తారని టిడిపి సీనియర్ నేత తిక్కాన చినదేముడు తెలిపారు. గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జగన్ ఎన్ని అక్రమ కేసులు బనాయించినా చంద్రబాబు వెంట్రుక కూడా పీకలేరని మండిపడ్డారు. ప్రజాసామ్యంలో నీతికి, న్యాయానికి విలువలేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేసారు. న్యాయవ్యవస్థపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లోందని తెలిపారు.

జిల్లాలో జగనన్న చేదోడు పథకం కింద

16,893 మందికి సాయం

విశాలాంధ్ర-విజయనగరం: జగనన్న చేదోడు పథకం క్రింద కుల వృత్తులు చేసుకునే రజక, నాయీ బ్రాహ్మణులు, టైలర్లు వృత్తి వారలకు 4 వ విడతగా ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి జమ చేసారు. గురువారం జగనన్న చేదోడు రాష్ట్రస్థాయి కార్యక్రమం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు లో జరిగే బహిరంగ సభలో బటన్ నొక్కి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో నాల్గవ విడత ఆర్థిక సహాయాన్ని జమ చేసారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, బి.సి కార్పొరేషన్ ఈ.డి పెంటోజీ రావు, బిసి నాయకులు, లబ్ధిదారులు పాల్గొని వీక్షించారు. జగన్న చేదోడు పథకం క్రింద దర్జీలు, రజకులు, నాయీ బ్రాహ్మణులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జిల్లాలో 16893 మంది లబ్ధిదారుల కు రు.16.89 కోట్ల సహాయాన్ని ప్రభుత్వం వారి ఖాతాలకు నేరుగా జమ చేయడం జరిగింది. ముఖ్యమంత్రి కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేశారు.

బాధితునికి ఆర్థిక సాయం అందించిన బేబి నాయన



విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం మండలం నందిగాం గ్రామంలో పప్పల చిన్నప్పల నాయుడు 2 దుక్కిటెద్దులు బండి తోలుతుండగా బండి చక్రాలు గుమ్ములో దిగి చెరువులోకి ఒరిగిపోయింది. ఈ కారణంగా రెండు ఎద్దులు ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి నీళ్లు త్రాగి బుధవారం మరణించాయి. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తెంటు లక్షుంనాయుడు, నియోజకవర్గ ఇన్చార్జ్ బేబినాయన కుటుంబీకులను గురువారం కలిసి పరా మర్శించారు. అనంతరం బాధితుడు పప్పల చినప్పలనాయుడుకి బేబినాయన రూ.30వేలు ఆర్థిక సహాయం అందించారు. దీంతో ఆ కుటుంబం బేబీ నాయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బాధితుల్ని పరామర్శించిన మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్

విశాలాంధ్ర-వంగర : మండలంలోని ఎం.సీతారాంపురంలో బంగారు వలసలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బాధిత కుటుంబాలను మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ రాజాం నియోజకవర్గం ఇన్చార్జి కోండ్రు మురళీమోహన్ ఆయా గ్రామాలలో గురువారం పర్యటించి పరామర్శించారు. ఎం సీతారాంపురంలో కర్రి గురమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో ఆమె కుమారులు కర్రి గురువులు, కర్రి నారాయణరావు, కర్రి అప్పారావు లను పరామర్శించారు, అదేవిధంగా అదే అదే గ్రామానికి చెందిన సైలాడ అప్పల నరసమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె భర్త సైలాడ రాజారావును పరామర్శించారు, బంగారు వలసలో ముంజి అప్పల నరసమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె కుమారుడు టిడిపి నాయకుడు ముంజు గోవిందరావును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వంగర మండల టిడిపి నాయకులు పిన్నింటి మోహనరావు లచ్చు బుక్త కృష్ణమూర్తి బెజ్జపురం రవి మజ్జి గణపతి అల్లిన రామారావు, బలగసాయి రాజాం రేగిడి సంతకవిటి టిడిపి నాయకులు పాల్గొన్నారు.

శ్రమదోపిడీ చేస్తున్న కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్ మొదలైన కాంట్రాక్టు వర్కర్ల కి సక్రమంగా జీతాలు, పిఎఫ్ డబ్బులు చెల్లించకుండా శ్రమని దోచుకు తింటున్న కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్ లో పెట్టి తక్షణమే వారిపై కఠిన చర్యలు తీసుకోవా లని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల్లో అన్ని ఆసుపత్రిల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి 2 గంటల పాటు విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టాలని యూనియన్ జిల్లా సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం విజయ నగరంలో ప్రభుత్వ సర్వజన మరియు ఘోష ఆసుపత్రిల లో నిరసన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమం ప్రారంభిం చడానికి విచ్చేసిన ఎఐటియుసి ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ హాస్పిటల్స్ లో ఉన్న పేషేంట్లకి ఇబ్బంది కలగకుండా, ప్రాణాలు లెక్కచేయకుండా ఆసుపత్రులను శుభ్రం చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లు, దగ్గరుండి ప్రతి పనిని పరిశీలిస్తున్న సూపర్వైజర్లుకి టి.వి.టి గ్రూప్ కాంట్రాక్టర్ 3 నెలలగా, ఆసుపత్రి కంటికి రెప్పలా కాపాడుతున్న సెక్యూరిటీ గార్డులకి 2 నెలల జీతాలు చెల్లించకుండ పస్తులు పెట్టి వెట్టిచెక్కిరి చేయించుకుంటారా అని మండి పడ్డారు. శ్రమకి తగిన జీతం లేక, ప్రతి నెల జీతాలు అందకపోవడం వల్ల ప్రభుత్వాలు పెంచుతున్న ధరల భారాలను తట్టుకోలేక అప్పులపాలు అయ్యి వడ్డీ వ్యాపా రుల చేతుల్లో చిక్కి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే అధికారులు స్పందించి తెలంగాణా లో ఉన్నా నల్లగొండ జిల్లా ఉన్న టివిటి గ్రూప్ కాంట్రాక్టర్ ను రప్పించి అధికారుల సమక్షంలో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి పెండింగ్ జీతాలు చెల్లించి, ప్రభుత్వం ఇచ్చిన జీవో ల ప్రకారం కాంట్రాక్టర్లు చేత జీతాలు, పి.ఎఫ్ డబ్బులు, ఈ.ఎస్.ఐ ఇప్పించి వర్కర్స్ సమస్యలు సామరస్యంగా పరిష్కారం చేయలేని పక్షంలో రానున్న రోజుల్లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఉద్యమం తీవ్రతరంగా చేస్తామని హెచ్చరించారు. తరువాత జరగబోయే పరిస్థితులకి మీరే బాధ్యత వహించాల్సి వస్తుందని బుగత అశోక్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రిల్లో పనిచేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ వర్కర్స్, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మంజూరు చేసిన ఇండ్ల పట్టాలపై దర్యాప్తు చేపట్టాలి

– ఇందిరమ్మ కాలనీ పట్టాలపై జరుగుతున్న సర్వే లో రాజకీయ ఒత్తిడి లేకుండా చేయాలి

– సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ డిమాండ్

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణంలో గల ఇందిరమ్మ కాలనీలో ప్రస్తుతం నిర్వహిస్తున్నటువంటి బినామీ ఇళ్ల పట్టాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందు వరుసలో పట్టాలు మంజూరు చేసి అవినీతికి పాల్పడిన సంఘటన పైన రెవెన్యూ యంత్రాంగం చేపడుతున్నటువంటి సర్వే అధికార పార్టీ నాయకుల కను సన్నల్లోనే జరుగుతుందని రాజకీయ నేతలు ఒత్తిడిలు లేకుండా పూర్తిస్థాయిలో నిజాయితీగా అవినీతిని వెలుగులోకి తీసుకు రావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఓమ్మి రమణ డిమాండ్ చేశారు. గురు వారం పట్టణం సిపిఐ పార్టీ కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ విలేకరుల సమావేశం ఏర్పాటు ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో జరుగుతున్న నకిలీ పట్టాల వ్యవహారం, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ముందు వరుసలో మంజూరు చేసిన ఇండ్ల పట్టాలు అవినీతి బయటపడాలంటే ముందుగా తాసిల్దారి కార్యాలయంలో ఉన్న ఇందిరమ్మ కాలనీ కి సంబంధించిన ఇండ్ల పట్టాల రిజిస్టర్ బయటకు తీయాలని, ఈ బినామీ ఇండ్ల పట్టాలకు మూల సూత్రధారులైన అప్పటి తాసిల్దారిగా విధులు నిర్వహించిన పత్రి గణపతి మరియు ప్రస్తుత వీఆర్వో గొట్టాపు సింహాచలం, తదితర సిబ్బంది పైన పూర్తిస్థాయిలో దర్యాప్తుచేస్తే అసలు సూత్రధారులు పాత్రధారులు విష యాలు బయటకు వస్తాయని అన్నారు. ఇందిరమ్మ కాలనీలో స్థానికేతరులకు కూడా ఇతర ప్రాంతాల వారికి నిబంధనలకు విరుద్ధంగా మంజూరు చేసిన ఇండ్ల పట్టాలు ఇచ్చి, భారీమొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. ఇందిరమ్మ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది కి ఇళ్ల పట్టాలను మంజూరు చేశారని. ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మంజూరు చేసిన ఇండ్ల పట్టాల పైన, అధికారి నేతలు అండతో ప్రభుత్వ స్థలాలను ఆక్రమణ చేసి కబ్జాలపైన వాటి పైన కూడా ప్రస్తుత రెవెన్యూ యంత్రాంగం దృష్టిసారించి. అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలకకుండా నిజాయితీగా వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడానికి తాసిల్దార్ కార్యాలయంలో ఇండ్ల పట్టాలకు సంబంధించి ఇండ్ల పట్టాలు రిజిస్టర్లు ఎక్కడ ఉన్నాయని ..? ఇండ్ల పట్టాలు రిజిస్టర్ లేకుండా ఏ విధంగా దర్యాప్తు చేస్తారని, ఇండ్ల పట్టాలు రిజిస్టర్ మాయం చేసిన సిబ్బంది పైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ కూడా ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వం ఇచ్చిన ఇల్లు స్థలం కంటే అదనంగా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకొని అక్రమ కట్టడాలు చేపట్టారని వాటిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే దర్యాప్తులో దర్యాప్తు సిబ్బందికి అనేక ఇండ్ల పట్టాల వ్యవహారం వెలుగులోకి వచ్చిందని నకిలీ పట్టాలు, ఒక పాట ఇస్తే రెండు పట్ల రెండు పట్టాల స్థలంలో ఇండ్ల నిర్మాణం చేపట్టడం వంటి అంశాలు దర్యాప్తు అధికారులకు వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. రెవెన్యూ అధికారులతో పాటు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్నప్పల నాయుడుకు తెలియకుండా ఎమ్మెల్యే అనుచరులమంటూ తిరుగుతున్న కొందరు (పాలకపక్ష)వైసీపీ నేతలు దర్యాప్తు అధికారులను తమకు అను కూలంగా దర్యాప్తు నివేదికలు చేయాలని ఒత్తిడికి గురి చేస్తున్నట్లు తెలుస్తోంది.ఓ ప్రక్క సర్వే జరుగుతుంటే రెండవ వైపు అయిన రైల్వే పట్టాల ప్రక్కన దందాలకు, ఆక్రమణలకు పాల్పడుతున్న చోటా నాయకులు ఎక్కువ య్యారని ఈ విషయాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్నప్పలనాయుడు గ్రహించాలని అలాగే ఎమ్మెల్యే పేరు చెబుతూ రెవెన్యూ అధికారుల సర్వే బృంధంతో తిరుగుతున్న కొంతమంది చోటా వైసీపీ నేతలు ఇదే అదునుగా సర్వే అధికారులపై ప్రభావం చూపిస్తు సర్వే చేస్తున్న అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారని అన్నారు. ఇకనైనా రెవెన్యూ యంత్రాంగం ఎటువంటి రాజకీయ ప్రలోభాలకు లొంగకుండా సర్వే చేసి. ఏదైతే ప్రభుత్వ స్థలాలు ఉన్నాయో వాటిపై ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. ఇంతవరకు రెవెన్యూ యంత్రాంగం సర్వే చేసిన వివరాలను పత్రికా ముఖంగా ప్రజానీకానికి బహిరంగంగా తెలియజేయాలని అవినీతికి పాల్పడిన రెవెన్యూ సిబ్బంది పైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఇందిరమ్మ కాలనీలో గతంలో జరిగిన ప్రస్తుతం జరుగుతున్నటువంటి భూ కబ్జాలపై లోకయుక్త కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న. ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు బి సింహాచలం పాల్గొన్నారు.

భానుడి ప్రతాపానికి ఎండుతున్న వరి చేను

గగ్గోలు పెడుతున్న రైతులు

సుమారు 15 రోజులు నుండి మొఖం చాటేసిన వరుణుడు

విశాలాంధ్ర-మెరకముడిదాం: మండలంలో గత 15 రోజులనుండి బానుడు తీవ్ర రూపం దాల్చటంతో పంటలు ఎండిపోయి మాడి మసవ్వటంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ ఏడాది వరి పంట 5,675 ఎకరాలు, మొక్కజొన్న 396 ఎకరాలు ఖరీఫ్ లో రైతులు సాగు చేశారు.అయితే వరి ఉభాలు జరిగినప్పుడు కొంత మేర వరుణుడు కనికరించినా,తర్వాత నుండి వరుణుడు కన్నెర్ర చేయటం తో పాటు బానుడు తీవ్ర రూపానికి వరి, మొక్క జొన్న పంటలు ఎండిపోతున్నాయి.ఈ ఏడాది ఖరీఫ్ పంటలు పరిస్థితి ప్రశ్నర్ధకంగా మారాయి. మెరక ప్రాంతాల్లో సుమారు మూడు నుండి నాలుగు వందలు ఎకరాలు వరకు వరి పంట ఎండి పోగా, పల్లపు ప్రాంతాల్లో కూడా నీరు లేక వర్షం కురవక సుమారు వంద ఎకరాలు వరకు ఎండి పోయినట్లు అధికార వర్గాలు ద్వారా తెలిసింది. మొక్క జొన్న పంట పరిస్థితి కూడా ఇంతే. పంటలు ఎండిపోవటంతో పాటు, తెగుళ్ల కూడా రావటం తో రైతులు గగ్గోలు పెడుతున్నారు. వర్షం కురవక పోవటంతో సాగునీటి చెరువు లు అడు గంటి పోయాయి. వరుణుడు కురవక పోయినా, చెరువుల్లో నీరు ఉంటే రైతులు మోటార్లు ద్వారా కొంతవరకు పంటలకు తోడుకునే వారు. బోర్లు వున్న చోట పంటలకు నీరు తోడుకోవాలన్నా విద్యుత్ ఎప్పుడు వు%శీ%టుందో ఎప్పుడు ఉండదో తెలియని పరిస్థితి. అందువలన రైతులు పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. వేలాది రూపాయిలు రైతులు పెట్టుబడి పెట్టి ఆకాశం వైపు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదే విదంగా వరుణుడు కన్నెర్ర చేస్తే పంటలు పరిస్థితి అగమ్య గొచరమే అని చెప్పకనే చెప్పవచ్చు. బాదాం, భగీరథపురం,కొండలావేరు, చెల్లాపురం, విశ్వనాథపురం, చినరవ్వా%శీ%, ఉత్తరావల్లి తదితర గ్రామాల్లో పంటలు ఎండిపోయాయి. మరికొన్ని గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తుంది. మండుతున్న ఎండలుకు పంటలు ఎండిపోవటంతో రైతులు వేదన రోదన వర్ణాతీతం. అందువలన ప్రభుత్వం మెరకముడిదాం మండలాన్ని కరువు మండలం గా ప్రకటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఏది ఏమైనా ఈ ఏడాది చివరకు పంటలు పరిస్థితి ఎలా ఉంటుందో వేచి చూడాల్సిందే.

మా సమస్యలు పరిష్కరించండి

పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికుల వినతి

విశాలాంధ్ర-విజయనగరం : అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో ఉన్న ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ లోని దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కార్మికుల సంఘం ప్రతినిధులు సోమవారం విజయనగరం పట్టణంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర రావుని కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో కూడా పలుమార్లు ప్రభుత్వం దృష్టిలో పెట్టిన సమస్య తీరని పరిస్థితుల్లో సమ్మెకి వెళ్ళటానికి నిర్ణయించినట్లు చెప్పారు.ఈనెల అనగా తేదీ 22.10.2023 తర్వాత ఏ రోజైనా సమ్మెలోకి వెళ్లడానికి నిర్ణయించుకున్నామని చెప్పారు. కావున తక్షణం డిమాండ్ల పరిష్కారానికి యాజమాన్యం సానుకూలంగా స్పందించేలా కమిషన్ సిఫార్సు చేయాలని కోరారు. వినతిలో టూరిజం కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి. 2010 అక్టోబర్ 10లో టూరిజం కార్పొరేషన్ యాజమాన్యం చేసిన ఒప్పం దాన్ని అమలు చేయాలి. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలి. రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేసి కాంట్రాక్ట్ మరియు అవుట్సోర్సింగ్ వారికి పదోన్నతి కల్పించాలి. ఈ సందర్భంగా ఎస్టి కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ టూరిజం కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. చైర్మన్ ను కలిసిన వారిలో కార్మికుల సంఘం జనరల్ సెక్రెటరీ అంజలిరావ్, స్టేట్ సెక్రటరీ బాబురావు, మరియు సంఘ నాయకులు ఉన్నారు.

పార్వతీపురం మన్యం

చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలి

సిపిఐ ఆధ్వర్యంలో గిరిజన ర్యాలీ

గిరిజనేతరుల దోపిడీ నుండి గిరిజనులను కాపాడదాం!

విశాలాంధ్ర-పార్వతీపురం: గిరిజనేతరుల దోపిడీ నుండి గిరిజనులను కాపాడుకుందాం అని సిపిఐ ఆధ్వర్యంలో గురువారం గుమ్మల క్ష్మిపురం లో గిరిజనుల భారీ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో గుమ్మలక్ష్మీపురం నుండి నీలకంఠపురం వరకూ మన్యంలో నివసిస్తున్న గిరిజనులందరూ పాల్గొనాలని సీపీఐ పిలుపునిచ్చింది. గుమ్మలక్ష్మీపురంలో విలేకరుల సమావేశంలో సీపీఐ నాయకులు మాట్లాడుతూ, గిరిజనేతరులు గుమ్మలక్ష్మీపురం నుండి నీలకంఠపురం వరకు గిరిజనులు అన్ని రకాలుగా దోపిడీకి, అణిచివేతకు గురవుతున్నారన్నారు. మన్యంలో పండించిన ప్రతీ దినిసులకు అతి తక్కువ డబ్బులు ఇచ్చి దోచుకుంటున్నారన్నారు, అక్రమంగా ఇల్లు నిర్మించడం గాని, అక్రమంగా గిరిజనుల భూములు అతీతక్కువ ధరతో కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. ఏ రకంగా చూసినా గిరిజనులు నిలువదోపిడీ గురవుతున్నారన్నారు, సీతంపేట తరహాలోనే గిరిజనేతరుల దోపిడీ నుండి గిరిజనులను కాపాడండి అని, నాన్ షెడ్యూల్ ఏరియాలను షెడ్యూల్ ప్రాంతంలోకి విలీనం చేయాలని... సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమం ప్రారంభిస్తున్నామని, సిపిఐ నిర్వహించిన ఈ కార్యక్రమాలలో గిరిజన ప్రజానీకం విస్తృతంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ, ఏపీ గిరిజన సమాఖ్య నాయకులు కూరంగి మన్మధరావు, టీ జీవన్, కుండంగి లింగరాజు, గరుగుబిల్లి సూరయ్య పువ్వల ప్రసాద్, సింగన్న, మండంగి రామారావు తదితరులు పాల్గొన్నారు.

గాదెలవలసలో జగనన్న ఆరోగ్య సురక్ష

520 మందికి తనిఖీలు నిర్వహణ

విశాలాంధ్ర-సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి న జగనన్న ఆరోగ్య సురక్ష రోగుల పాలిట వరమని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. గురువారం మండలంలోని గాదెలవలసలో జరిగినజగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వారుపరిశీలించారు.శిబిరంవద్ద ఏర్పాటుచేసిన కౌంటర్ల ద్వారా అందజేస్తున్న వైద్య సేవలను పరిశీలించారు.500మందికి పైగా రోగులకు వైద్యసేవలు అందించారు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారితోపాటు ఎంపిపి ప్రతినిది బలగ శ్రీరాములు, జెడ్పీటీసీ బాబ్జి, బొంగు చిట్టిరాజు, పోల ఈశ్వరనారాయణ, ఆర్వీ పార్ధసారథి,తదితరులు పాల్గొన్నారు. వైద్యశిబిరంలో పెదంకలం,సీతానగరం పిహెచ్సి వైద్యులు రాధాకాంత్,లావణ్య ఇద్దరు స్పెషలిస్ట్ వైద్యులు రాజేంద్ర, చింతా స్వరూప్ లు తనిఖీలు నిర్వహించి మందులు అందజేశారు.కంటి తనిఖీలు కూడా నిర్వహించారు.అంగన్వాడీ సిబ్బంది పౌష్టికాహారం స్టాల్ ఏర్పాటు చేయగా ఐసీడీఎస్ పిఓ సుగుణ, సూపర్ వైజర్లు సురేఖ, అంగన్వాడి కార్యకర్తలు,సహాయకులు పాల్గొని వారి సేవలను వివరించారు.ఎంపిడిఓ మహేష్ రెడ్డి, ఎంఈఓ సూరిదేముడు, సర్పంచ్ బొన్నాడ, తిరుపతిరావు, బొన్నాడ శివ, సచివాలయం సిబ్బంది సెక్రెటరీలు శశిభూషణరావు, సాయిప్రియాంక, విఆర్ ఓ శ్రీనివాసరావు,స్వర్ణలత, ఈశ్వరరావు,గణేష్,అప్పారావు,రమణ, జగన్మోహనరావు,సునీత, వేణు, పార్వతి, శైలజ ,వైద్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు, అంగన్వాడి కార్యకర్తలు,గ్రామస్తులు తదితరులతో పాటు వివిధ సచివాలయంల సిబ్బంది పాల్గొన్నారు. వైద్యసేవలు, వివిధ కౌంటర్ల ఏర్పాటు, వివిధ రకాల సేవలు పట్ల ప్రజలు, రోగులు సంతృప్తి వ్యక్తంచేశారు.

దుర్గాదేవీను దర్శించుకున్న ఎమ్మెల్యే జోగారావు

విశాలాంధ్ర-సీతానగరం: మండలం లోని గాదెలవలస గ్రామంలో దసరా నవరాత్రులు సందర్భంగా ఏర్పాటు చేసిన దేవీ విగ్రహాన్ని ఎమ్మెల్యే జోగా రావు గురువారం సందర్శించి పూజలు నిర్వహించారు.అర్చకులు ఆయనను ఆశీర్వదించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొన్నాడ తిరుపతిరావు, ఎంపిపి ప్రతినిది బలగ శ్రీరాములు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు రక్ష

వైస్ ఎంపిపి రెడ్డి సురేష్

విశాలాంధ్ర-సాలూరు రూరల్: జగనన్న ఆరోగ్యసు రక్ష కార్యక్రమం పేదలకు రక్ష అని వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ అన్నారు. గురువారం పెదపదం సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వైస్ ఎంపిపి రెడ్డి. సురేష్ ప్రారంభించారు.వైద్య శిబిరాన్ని పరిశీలించి,ప్రజలకు అందుతున్న వైద్య సేవల వివరాలు తెలుసుకున్నారు.జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి.పద్మావతి శిబిరంలో వైద్యం అందిస్తున్న డాక్టర్ల సేవలను కొనియాడారు.వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమం చారిత్రాత్మక ఘట్టమన్నారు.గ్రామాలకే స్పెషలిస్ట్ వైద్యులు తరలివచ్చి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇవ్వడం మునుపెన్నుడూ చూడలేదన్నారు.ప్రజలంతా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమం లో ఎంపిడిఓ గొల్లపల్లి. పార్వతి, స్థానిక సర్పంచ్ రెడ్డి.సుకన్య,మండల వైకాపా అధ్యక్షుడు సువ్వాడ.భరత్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రైతులకు ధాన్యం బకాయిలు ఇప్పించి అవినీతి అధికారులను కఠినంగా శిక్షించాలి

ఏపీ రైతు సంఘం జిల్లా సమితి కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్

విశాలాంధ్ర-బెలగాం: కొందరు డేటా ఎంట్రీ ఆపరేటర్లు రైతుల అకౌంట్ కు బదులు తమ సొంత బ్యాంక్ ఖాతాలకు మళ్లించి అవినీతికి పాల్పడ్డారని దీంతో నిజమైన రైతులకు ప్రభుత్వ డబ్బులు నేటికీ అందలేదని దీనిపై విజిలెన్స్ & ఎన్ఫోర్స్మెంట్ వారితో పూర్తి విచారణ జరిపించి మోసపోయిన జిల్లా రైతులకు రావలసిన ధాన్యం బకాయలను ఇప్పించి అవినీతికి కారకులను కఠినంగా శిక్షించాలని ఏపీ రైతు సంఘం జిల్లా సమితి కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన పార్వతీపురం కలెక్టర్ కార్యాలయంలో గురువారం జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావుకు పలు సమస్యలపై కూడిన వినతిపత్రం అందజేశారు. దీనిపై బుడితి మాట్లాడుతూ... 2022-23 ఖరీఫ్ సీజన్లో ధాన్యం రైతుల నుంచి సేకరించి సమయంలో అధికార యంత్రాంగం చొరవ వలన రైతుల నుంచి ధాన్యం సేకరణ తొందరగా జరిగిందని ఒకవైపు వాతావరణం అనుకూలం, మరో వైపు సంక్రాంతి పండగ భారం తోడై రైతు ధాన్యాన్ని తరలించడానికి తొందర పడడంతో ఉన్నపలంగా వాహనదారులు అద్దెలను అధికంగా పెంచడంతో రైతులు తప్పని పరిస్థితుల్లో భారాన్ని మోయవలసి వచ్చిందన్నారు. దీన్ని ఆసరా చేసుకున్న డేటా ఎంట్రీ ఆపరేటర్లు చేతివాటం ప్రదర్శించి ధాన్యం రవాణాలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. కావున విజిలెన్స్ &ఎన్ఫోర్స్మెంట్ వారిచే విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని, రైతులకు న్యాయం చేయాలని కోరారు. జిల్లాలో సాగునీటి వనరులకు కొదవలేదని, జంఝావతి, రావాడ రిజర్వాయర్, తోటపల్లి బ్యారేజ్, పెదంకలా రిజర్వాయర్ల ఆకట్టు చివర భూములకు సాగునీరు అందక అప్పులు చేసి పెట్టిన పంట పెట్టుబడులు నేలపాలు అవుతున్నా యని, పంటలు ఎండిపోతున్నాయని, దీనంతటికీ ప్రభుత్వ మొద్దు నిద్ర, జలవనరుల శాఖ అధికారుల నిర్లక్ష్యవైఖరే కారణమన్నారు. అత్యవసర పనులుగా భావించి తమ కోటా నుంచైనా నిధులు ఇచ్చి కాలువలలో ఉన్న తుప్ప, డొంకలను తొలగించి ఆయకట్టుకు సాగునీరు అందించి ఎండిపోతున్న పంటలను రక్షిం చాలని అన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్ లో సమస్యలు రాకుండా పలు అంశాలను పరిగణలోకి తీసుకోవా లన్నారు. ధాన్యం సేకరణలో జంబ్లింగ్ విధానం రద్దు చేయాలని, ఇతర జిల్లాల రైస్ మిల్లులకు ధాన్యం తరలించడానికి అనుమతి ఇవ్వాలన్నారు. ధాన్యం రవాణాకు రైతులకు అవసరమైన వాహనాలను ప్రభుత్వమే సమ కూర్చాలని, క్వింటా ధాన్యానికి 5 కేజీలు తరుగు కింద రైతులు ఇచ్చుటకు జిల్లా పెద్దలు, అధికారులతో ఒప్పందం జరిగిందని చెప్పి మిల్లర్లు చేసిన దోపిడీని ఈ ఏడాది నిరోధించాలన్నారు. రైతులు పండించిన ధాన్యం అంతటినీ టార్గెట్లతో సంబంధం లేకుండా ఆర్బికే కేంద్రాల ద్వారా సేకరించాలని, ధాన్యం సేకరణలో మిల్లర్లతో సంబంధం లేకుండా ఆర్బీకే కేంద్రాలు ఇచ్చే ధాన్యం నాణ్యతా ప్రమాణాల ఆధారంగా ధర నిర్ధారించిన మేరకు బ్యాంకు అకౌంట్లకు డబ్బులు జమ చేయాలన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై చర్చించుటకు అధికారులు మిల్లర్లు, రైతుసంఘాలతో సమావేశం నిర్వహించాని కోరారు. ఈమేరకు జేసీ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు త్వరలోనే ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈ వి నాయుడు, వెలమల సత్యనారాయణ పోలరౌతు చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర పార్వతీపురం టౌన్: శుక్రవారం ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు పార్వతిపురం పట్టణ పరిధిలో లైన్ మెయింటెనెన్స్ వర్కు చేపట్టనున్న కారణంగా బైపాస్ కాలనీ అజయ్ నగర్ మారుతి నగర్ ఇందిరా కాలనీ సౌందర్య మెయిన్ రోడ్ నుండి కుమ్మరి వీధి వరకు అలాగే చెరువు గట్టు గాంధీ సత్రం దేవినగర్ పార్వతి నగర్ కృష్ణపల్లి సారికివీధి శివాలయం సందు జగన్నాధపురం రెడ్డి వీధి పాత రెల్లి వీధి కుసుమ గుడ్డివీధి బెలగాం జీఎస్ రోడ్డు ఆర్టీసీకాంప్లెక్స్ పరిధిలో కరెంట్ నిలిపివేయనున్నారు.

జిల్లాలో 9,522 మంది లబ్ధిదారులకు జగనన్న చేదోడు నిధులు



విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో 9,522 మంది లబ్ధిదారులకు 9.522 కోట్ల రూపాయలు జగనన్న చేదోడు 4వ విడత నిధులు పంపిణీ చేసినట్లు జాయింట్ కలెక్టరు ఆర్. గోవిందరావు తెలిపారు. గురువారం కలెక్టరు కార్యాలయంలో జరిగిన జగనన్న చోదోడు జిల్లా స్థాయి నిధులు పంపిణీ కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు పాల్గొని లబ్ధిదారులకు చెక్కును అందజేసి నిధులు విడుదల చేసారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్న వెనుకబడిన వర్గాలు ఆర్థికంగా ఎదగడానికి, షాపులున్న రజకులు, షాపులున్న నాయీ బ్రాహ్మణులు, టైలరింగ్ వృత్తి చేయు షాపులున్న అన్ని కులముల వారికి సంవత్సరానికి 10వేలరూపాయలు చొప్పున, 5.సంవత్సరములకు 50వేల రూపాయలు అందిస్తున్న పథకంలో భాగంగా జిల్లాలో 4వ విడతగా 2023-24 ఆర్థిక సంవత్సరానికి 2,969 రజకులకు 2.969 కోట్లరూపాయలు, 1090 నాయీ బ్రాహ్మణులకు 1.090 కోట్ల రూపాయలు, 5,463 టైలరింగు వృత్తి లబ్దిదారులకు 5.463 కోట్లరూపాయల చొప్పున మొత్తం 9,522 మంది లబ్ధిదారులకు 9.522 కోట్ల రూపాయల నిధులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. టిడ్కో చైర్మన్ జె. ప్రసన్నకుమార్ మాట్లాడూతూ ప్రభుత్వం పేదలను ఆదుకొనుటకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని, అందులో వెనుకబడిన కులాల అభివృద్ధికి, వారి ఆర్థిక ఉన్నతికి అధిక ప్రాధాన్యమిస్తూ చేదోడుగా నిధులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు 3.విడతలలో జిల్లాలో 8,266 రజకులకు 826.60 లక్షల రూపాయలు, 3209 నాయీ బ్రాహ్మణులకు 320.90 లక్షల రూపాయలు, 10,729 టైలరింగు వృత్తి లబ్దిదారులకు 1072.90 లక్షల రూపాయల చొప్పున మొత్తం 22204 మంది లబ్దిదారులకు 2220.40 లక్షలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ చైర్మన్ ఆర్. రమాదేవి, తూర్పుకాపు డైరెక్టర్ మజ్జి నాగమణి, కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్. మెహర్ ప్రసాద్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి.జనార్దన్, శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్. తిరుపతి, కూరాకుల కార్పొరేషన్ డైరెక్టరు పి. తిరుపతిరావు, కె. రమణమ్మ, తెలుకల కార్పొరేషన్ డైరెక్టర్ సిహెచ్. వెంకటరమణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి : డిఈఓ

విశాలాంధ్ర-కురుపాం: మండలం లో పెండింగ్ లో ఉన్న నాడు.. నేడు పనులు సకాలంలో పూర్తి చేయాలని డిఈఓ ఎన్.ప్రేమ్ కుమార్ ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు కు సూచించారు. గురువారం మండల విధ్యాసేఖాధికారి కార్యాలయం ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు-నేడు పనులు త్వరితగతిన కంప్లీట్ చేయవలెనని సూచించారు. స్టేట్ ఎడ్యుకేషన్ అస్సెస్మెంట్ సర్వే నవంబర్ 3న జరుగుతుందని, దానికి సంబంధించి రివ్యూ ఉందని, కురుపాం మండలంలో 21 స్కూల్స్ లో 3వ,6వ,9వ తరగతి విద్యార్థులకు ఈ సర్వే జరగనుందని అన్ని ఏర్పాట్లు చేయాలని మండల విద్యాశాఖాధికారి సత్యన్నారాయణను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల హెచ్ఎం శంకర్రావు, సిఆర్పీ నరేష్, ఎంఐఎస్, ఎల్డిఎ పాల్గొన్నారు.

'భగవంత్ కేసరి' విడుదల సందర్భంగా కేక్ కట్ చేసిన మాజీ ఎమ్మెల్యే కోళ్ల దంపతులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఎస్.కోట పట్టణంలోని శ్రీనివాస మహల్‌లో భగవంత్ కేసరి విడుదల సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ రాంప్రసాద్ దంపతులు కేక్ కట్ చేసి అభిమానులకు, టీడీపీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లల పట్ల విలువలు, వాళ్ళలో బలహీనతలను పెద్దలు ఏ విధంగా సహకార మందజేసీ వాటినిఅదిగమించే విధంగా సహకారం అదించాలనే విషయాన్ని అద్భుతంగా చూపించారని, బాలయ్యబాబు అద్భుతంగా నటించారని, అందరూ కుటుంబసమేతంగా చూడాలని కోరారు. సినిమా చాలా బాగుందని, నటినటులకి, సాంకేతిక నిపుణులకి మాజీ ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కోళ్ల బాలాజీ రాంప్రసాద్, జి.ఎస్.నాయుడు, బాలయ్య అభిమానులు అనకాపల్లి చెల్లయ్య, కాపుగంటి వాసు, కనిశెట్టి ఈశ్వరరావు, టీడీపీ శ్రేణులు చక్కా కిరణ్‌కుమార్, పెదగాడ రాజు, జి.బ్రహ్మజీ, వాకాడ బాలు, ఎస్.అనిల్, రమేష్ పాల్గొన్నారు.

మహిళ నుండి మద్యం బాటిళ్లు స్వాధీనం..

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణంలో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సిబ్బంది దాడులు నిర్వహించి ఎస్.కోట మండలం, ఆలుగుబిల్లి గ్రామానికి చెందిన ముంత పాపమ్మ అనే మహిళ నుండి ఆరు మద్యం బాటిళ్లు స్వాధీనం (బెల్టు కేసు) చేసుకుని మహిళకు 41(ఎ) నోటీసు జారీ చేసినట్లు ఎస్ఈబీ సీఐ ఎస్.ధర్మారావు గురువారం తెలియజేశారు. ఈ దాడుల్లో ఎస్.ఐ ఎన్.రమ్యశ్రీ, పోలీసులు టీపీఎన్ఎస్ ప్రసాద్, వి.పుష్పలత, ప్రమీల, సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఎంపీడీఓ పట్నాయక్

విశాలాంధ్ర-వేపాడ: శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సాయి కూర్నాద్ పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షులు దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన నిర్వహించబోయే ఈ కార్యక్రమానికి మండలంలో గల సర్పంచులు ఎంపీటిసీలతో పాటు మండలంలో గల అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని ఆయన కోరారు.

ఎఆర్‌పేట అన్నదానం : పాల్గొన్న గొంపకృష్ణ, శివరామకృష్ణలు

విశాలాంధ్ర-జామి: మండలంలోని అన్నం రాజుపేటలో గురువారం దేవి నవరాత్రుల లో భాగంగా చండీ హక్షమం జరిగింది. అనంతరం మధ్యాహ్నం భారీఎత్తున అన్నదానకార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు, శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు స్థానిక టీడీపీ నేత ఎన్నింటి అప్పలరాజు, మాజీ సర్పంచ్ ఎన్నింటి మంగమ్మల ఆహ్వానం మేరకు ఎస్‌కోట నియోజకవర్గానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంపకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం శివరామకృష్ణలు హాజరయ్యారు. వీరికి ఘనంగా స్వాగతం పలికిన స్థానికులు వారిని అమ్మవారి దర్శనానికి తీసుకువెళ్ళారు. ప్రత్యేక పూజలు అనంతరం ఇరువురు నేతలు అన్నధాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ మంచి వ్యక్తిత్వం, ఆధ్యాత్మిక చింతన కలిగిన అప్పలరాజు ప్రతీ ఏటా దేవి నవరాత్రులను ఘనంగా నిర్వహించడంపై అభినందించారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు లగుడు రవికుమార్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డి పైడిబాబు, గంట్యాడ నేతలు కొరుపోలు రమేష్, మిత్తిరెడ్డి ఈశ్వరరావు, అరుణ గ్రామంలోని టీడీపీనేతలు, కార్యకర్తలు హాజరయ్యారు.

ఎటిఎం కార్డు మార్చి రూ.30వేలు కాజేశాడు

అగంతకుడు ఇచ్చిన నకిలీ ఎస్‌బిఐ కార్డు

విశాలాంధ్ర-జామి: నగదు తీసుకుందామని వచ్చిన ఓ వృద్ధుడ్ని మోసగించి అతని కార్డు మార్చి రూ.30వేలు కాజేసిన సంఘటన మండల కేంద్రమైన జామిలో జరిగింది. వివరాల్లోకి వెళితే జామి ఎస్‌బిఐ బ్యాంకు కింద ఉన్న ఎటిఎం సెంటర్‌కు జామికి చెందిన రిటైర్డ్ వసతిగృహ ఉద్యోగి అల్లక చిన్నారావు వచ్చాడు. ఎటిఎంని వినియోగించడం తెలియన ఆయన అక్కడే ఉన్న ఓయువకుడ్ని రూ.వెయ్యి తీయమని కోరాడు. అతని కోరిక మేరకు నగదు తీసి ఎటిఎం కార్డును మార్చి ఇచ్చివేసాడు. ఇది గుర్తించని ఈశ్వరరావు ఇంటికి వెళ్ళిపోయాడు. మూడు రోజుల అనంతరం తన అకౌంట్‌నుంచి నగదు విత్‌డ్రా అవుతన్న విషయాన్ని గుర్తించి వెంటనే బంధువుల ద్వారా బ్యాంకును సంప్రదించి అకౌంట్ బ్లాక్ చేయించాడు. కానీ అప్పటికే ఆగంతుకుడు రూ.30వేలను విత్‌డ్రా చేసాడు. లబోదిబో మంటూ జామి పోలీసులను ఈశ్వరరావు ఆశ్రయించాడు.

మాజీ సర్పంచ్ గార పెంటయ్య మృతి

విశాలాంధ్ర-గజపతినగరం : : మండలంలోని ముచ్చర్ల గ్రామ మాజీ సర్పంచ్ గార పెంటయ్య గురువారం ఉదయం మృతి చెందారు గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు టిడిపికి చెందిన పెంటయ్య ముచ్చర్ల లో సీఎం జగన్ పాదయాత్ర చేసినప్పుడు వైసీపీలో చేరారు ఆయన మృతి పట్ల పలువురు నాయకులు సంతాపం తెలియజేశారు పెంటయ్య గ్రామాభివృద్ధికి కీలక పాత్ర పోషించాలని మంచికి మారుపేరుగా నిలిచారని కొనియాడారు.

ప్రజారోగ్యానికి భరోసా - జగనన్న ఆరోగ్య సురక్ష

ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

విశాలాంధ్ర- శృంగవరపు కోట : ప్రజారోగ్యానికి భరోసా - జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఎస్.కోట మండలం, కొత్తూరు సచివాలయం పరిధిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి క్యాంపుకు వచ్చిన రోగులను పలకరిస్తూ వారి సమస్యలను తెలుసుకుంటూ.. వారికి వైద్యులు ఇచ్చే వైద్యాన్ని తెలుసుకున్నారు. పేదల ఆరోగ్యమే జగనన్న ధ్యేయమని రోగులకు భరోసా ఇచ్చారు. ప్రతి ఒక్కరూ రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రజలకి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా ఆర్థిక సహాయం చేసినా సరే ఆరోగ్యం విషయంలో పేదకుటుంబాలు మెరుగైన వైద్యం చేయించుకోలేకపోతున్నారని, అలాంటి వారికి జగనన్న ఆరోగ్య సురక్ష చాలా ఉపయోగపడుతుందని తెలియజేశారు. చాలా మంది రోగులు వారికి వచ్చిన ఆరోగ్య సమస్యకు ఎవరివద్దకు వెళ్లాలో కూడా తెలియదని, అలాంటి వారికి అవసరమైన సహాయం ప్రభుత్వం నుండి అందేలా చూడాలని అధికారులను ఎమ్మెల్యే కడుబండి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పెనిశెట్టి వెంకటరమణ, స్టేట్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, స్థానిక సర్పంచ్ చిట్టిపోలు లక్ష్మి, నాయకులు ఉల్లి శంకర్, చిట్టిపోలు సాయి, వెంకటరమణపేట సర్పంచ్ మంచిన శివకోటి, కొట్టాం వెంకటరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, వైద్య సిబ్బంధి, సచివాలయం సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షలో అద్భుతంగా అంగన్వాడీ సేవలు

వావిలపాడులో 32 పౌష్టికాహార వంటకాల ప్రదర్శన

వేపాడ : మండలంలోని వావిలపాడు గ్రామంలో గురువారం గ్రామ సర్పంచ్ బీల రాజేశ్వరి, సతీష్ దంపతుల సారథ్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిభిరంలో భాగంగా ఐసీడియస్ సూపెర్వైజర్ భాగ్యవతి పర్యవేక్షణలో అంగన్వాడీ కార్యకర్తలు అందించిన సేవలు అద్భుతంగా ఉన్నాయి. ఈ సందర్భగా వావిలపాడు, నల్లబిల్లి, నీలకంఠరాజపురం గ్రామాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు 32రకాల పౌష్టికాహార వంటకాలను తయారు చేసి వైద్యశిభిరంలో ప్రదర్శించారు. ఎంతో రుచికరంగా తయారు చేసిన పౌష్టికాహార వంటకాలను డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జడ్పీటీసీ సభ్యులు ఎస్ అప్పారావు, జేసియస్ కన్వీనర్ బోజంకి శ్రీను, వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఈర్లె సన్యాసినాయుడు,వైసీపీ నాయకులు గోగాడ చిన్నబ్బినాయుడు,సచివాలయం కన్వీనర్ బాదిరెడ్డి శంకర్,ఎంపీడీఓ పట్నాయక్ తదితరులు రుచి చూసి ఆస్వాదించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలను ప్రజాప్రతినిధులంతా అభినందించారు.ఈ కార్యక్రమంలో పి లక్ష్మి, గండిరాధిక, అమ్మాజీ, పరమేశ్వరి, నాగమణి, రమణమ్మ, మణి, ప్రభావతి,మూకల రాంభాయి, భషీర్, లక్ష్మి, దేముడమ్మ తదితర అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జగన్నన్న ఆరోగ్య సురక్ష : ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర-బొబ్బిలి: గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. గురువారం స్థానిక మండలం కలవరాయి గ్రామంలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎమ్మెల్యే శంబంగి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలలో ఆరోగ్య ప్రదాతగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ఆరోగ్య సురక్ష ద్వారా సుమారు ఏడు రకాల సేవలకు ఉచితంగా వైద్యం అందజేయడం జరుగుతుందని తెలిపారు. అనారోగ్య భారిన పడిన రోగులు ఈ ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొత్స నటరాజ్,ఎంపీటీసీ పాటూరి సింహాచలం,ఎంపీడీఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యానికి - జగనన్న ఆరోగ్య సురక్ష

డిసిసిబి చైర్మన్ వి.వి చినరాము నాయుడు

విశాలాంధ్ర-వేపాడ: రాష్ట్ర ప్రజానీకం ఆరోగ్యం దృష్ట్యా సీఎం జగన్మోహన్ రెడ్డి ముందు చూపుతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారని డిసిసిబి చైర్మన్ వేచలపు వెంకట చిన రామనాయుడు అన్నారు. మండలంలోని వావిలపాడు సచివాలయ పరిధిలో గ్రామ సర్పంచ్ బీల రాజేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని ఆయన వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామంలోనే ప్రజల వద్దకు కార్పొరేటు వైద్యానికి ధీటుగా ప్రభుత్వ వైద్యాధికారులచే ఉచితంగా వైద్యం అందించిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. అలాగే ఎన్నో పథకాలను అమలు చేస్తున్నప్పటికీ విద్య వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి ప్రజలను ఆరోగ్యవంతులను చేయాలని తపనతో సీఎం ఉన్నారని అందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా 105 రకాల వ్యాధులకు సంబంధించి మందులను అందిస్తున్నారు కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు దొగ్గ సత్యవంతుడు జడ్పిటిసి సేనాపతి అప్పారావు, వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షులు ఈర్లే సన్యాసినాయుడు, జెసిఎస్ కన్వీనర్ భోజంకి శ్రీను,సచివాల కన్వీనర్ బాదిరెడ్డి శంకరరావు, వైసీపీ నాయకులు గోగాడ జగన్నాథం నాయుడు,బీల సతీష్, ఎంపీడీఓ పట్నాయక్, వైద్యాధికారులు సిబ్బంది, సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం

ధీర ఫౌండేషన్ అధినేత బొత్స సందీప్

విశాలాంధ్ర-మెరకముడిదాం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టత్మాకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదప్రజలకు వరం అని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యన్నారాయణ తనయుడు, ధీర ఫౌండేషన్ అధినేత డాక్టర్ బొత్స సందీప్ అన్నారు. గురువవారం నాడు ఊటపల్లి సచివాలయం లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంను పరిశీలించారు. అనంతరం ప్రజలను, రోగులనుద్దేశించి సందీప్ మాట్లాడుతూ పేదలు ఇంటిముంగిటకే వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశ్యం తో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ను ఏర్పాటు జరిగిందన్నారు. ఈ వైద్య శిభిరంలో పేదలుకు అన్ని వ్యాదులుకు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తూ, ఉచితంగా ప్రభుత్వం మందులు పంపిణీ చేయటం జరుగుతుందని తెలిపారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్య వైద్య శిభిరాలును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైద్యం కోసం పేదలుకు ఎంత ఖర్చు అయినా ప్రభుత్వం భరిస్తుందని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సంగిరెడ్డి లక్ష్మి, మండల వైసీపీ నాయకులు టి వేణుగోపాలరావు, కె వెంకటరావు, ఎన్ వెంకటరమణ రాజు, ఎం పి డి ఓ ఎం రత్నం, పులిగుమ్మి, శ్యామాయవలస సర్పంచ్ అధికార ప్రతినిధులు టి ఈశ్వర రావు, ఎం వెంకన్న, సర్పంచ్ లు, ఎం పి టి సి లు, పి హెచ్ సి సిబ్బంది, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ చేయడమే లక్ష్యం : ఎంపీపీ గౌరి

విశాలాంధ్ర-తెర్లాం/బాడంగి: మండలంలో గొల్లాది సచివాలయం లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీపీ గౌరి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తూ రాష్ట్రం లో పేద ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే గౌరవ ముఖ్యమంత్రి వర్యులు జగన్ యొక్క ధ్యేయం అని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో డాక్టర్స్ దగ్గకు ప్రజలు వెళ్ళేవారు కానీ జగనన్న ప్రభుత్వ హయాంలో డాక్టర్స్ నే ప్రజలు వద్దకు పంపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉచితంగానే వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయడం జరుగుతుంది. వీటికి అయ్యే ఖర్చు ప్రభుత్వం భరిస్తుంది. కావున ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పెంద్దింటి రామ రామ, ఎంపీడీవో , డిప్యూటీ తహసిల్దార్ ,ఎంపిపి ప్రతినిది మధు , గొల్లాధి సర్పంచ్ బేతనపల్లి కిరణ్ మయ్ , ఎంపిటిసి గోవింద్ , వైస్ ఎంపిపి రమేష్ , సచివాలయం కన్వీనర్ స్వామి నాయుడు , విద్య సిబ్బంది,సచివాలయం సిబ్బంది. గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అనంతరం ప్రజలుకు మందులు పంపిణీ చేయడం జరిగింది.

ఈ వైద్య సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-బెలగాం: పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) కార్యక్రమాన్ని బందలుప్పి పిహెచ్సి వైద్య అధికారి డాక్టర్ తిరుమల ప్రసాద్ రోగులకు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో అన్ని వైద్య కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని పలు ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారికి అన్ని రక్త పరీక్షలు చేసి వారికి కావలసిన మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఈ వైద్య శిబిరానికి స్పెషలిస్ట్ వైద్యులు రావడం జరుగుతుందని, రిఫరల్ అవసరమైన వారిని గుర్తించి జిల్లా హాస్పిటల్ కి పంపించడం జరుగుతుందన్నారు. లెప్రసీ లక్షణాలు ఉన్నవారు, పిల్లల్లో పుట్టుక లోపాలు గుర్తించడం గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం పై అవగాహన కల్పించుతున్నామని తెలిపారు. కావున ప్రజలు ఈ వైద్య సేవలు వినియోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరాములు నాయుడు, హెల్త్ సూపర్ వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులు వర్షా భావాన్ని తట్టుకునే చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర-పాచిపెంట: గత 20 రోజులుగా వర్షాలు లేకపోవడం వలన మెట్టు పంటలు వర్షాభావ ప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉందని రైతులు తగు చర్యలు చేపట్టడం ద్వారా పంటలను రక్షించుకోవచ్చు అని వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు అన్నారు పి కొనవలస రైతు భరోసా కేంద్రం పరిధిలోగల పంటలను పరిశీలిస్తూ రైతులకు పలు సూచనలు జారీ చేశారు. వర్షాభావానికి గురయ్యే పంటపై రెండు శాతం యూరియా ద్రావణాన్ని పిచికారి చేసుకోవడం ద్వారా పది రోజులపాటు పంటనుకాపాడుకోవచ్చని తెలిపారు. ఎండ వేడిమి కి దోమపోటు మరియు పాము పొడ తెగులు ఉధృతి ఎక్కువగా ఉందని ఆర్ జి ఎల్ 2537 మరియు శాంభమసూరి రకాలు వీటిని తట్టుకోలేవని నివారణ చర్యలుగా ఇమెడా క్లోప్రేడ్ లేదా థయో మెథగ్జామ్ లేదా చెస్ లేదా అప్లాడ్ వంటి మందులలో ఒకదానిని సాఫ్ లేదా హెక్సా కొనజోల్ లేదా ప్రొఫీ కొనజోల్ మందులతో కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. వర్షాభావానికి గురయ్యే పత్తి పంటపై మల్టీకే ఐదు గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని లేదా రెండు శాతం యూరియా ద్రావణాన్ని ఫిజికల్ చేసుకోవాలని సూచించారు వర్షా భావానికి రసం పీల్చు పురుగులు ఉధృతి ఎక్కువ అయ్యే అవకాశం ఉందని వీటి నివారణకు ఎసిటమిప్రిడ్ లేదా తయో మెతాక్జోమ్ లలో ఒకదానిని 0.4 గ్రాములు ఒక లీటర్ నీటి కలిపి పిచికారి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో వి ఏ ఏ నాగమణి మరియు రైతులు పాల్గొన్నారు...

కొత్త దుప్పాడలో ఘనంగా దీపారాధన

విశాలాంధ్ర-విజయనగరం : దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్థానిక 38వ డివిజన్ కొత్త దుప్పాడలో దీపారాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. మూర్తి పంతులు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని శివలింగం, త్రిశూలాన్ని దీపాలతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తోగురోతు సంధ్యారాణి, మాజీ కౌన్సిలర్లు బొబ్బాది త్రినాధరావు, కరణం రమణారావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు తుమ్మగంటి రామ్మోహన రావు, తుమ్మగంటి దుర్గారావు, ఓల్లి శ్రీనివాసరావు, తాడ్డి నాగచంద్రరావు, హరిబాబు,బెల్లాన సాయి, పల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మంచిచేసే ప్రభుత్వానికి అండగా నిలవాలి

సి.ఆర్.మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న పథకాలతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలోకి దూసుకు వెళుతుందని సి.రాఘవచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను ఇతర రాష్ట్రాలు సైతం ఆదర్శంగా తీసుకుంటున్నాయని గుర్తుచేశారు. సి.ఆర్.ఏ.పి మీడియా అకాడమీ, ఇంటిగ్రేటెడ్ రూరల్ పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అభివృద్ధిపథంలో ఆంధ్రప్రదేశ్-పాలన సంస్కరణలు-మెరుగైన పౌర సేవలపై సదస్సు గురువారం స్థానిక లయన్స్ క్లబ్ హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి చైర్మన్ ముఖ్యఅతిధిగా పాల్గొని శాసనసభ్యులు అలజంగి జోగారావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతంగా ఉన్న పార్వతీపురంను పరిపాలన వికేంద్రికరణలో భాగంగా జిల్లాగా చేశారన్నారు. ప్రజల వద్దకు సంక్షేమ ఫలాలను తీసుకెళ్లే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారని, ప్రతి 50 గృహాలకు వాలంటీర్లును ఏర్పాటుచేసి ప్రజల ముంగిటికే ప్రభు త్వాన్ని తీసుకువచ్చి సుపరిపాలనకు భాష్యం చెప్పిన ఘనత సీఎందేనని కొనియాడారు. గత 40ఏళ్లలో ఏ ముఖ్యమంత్రి చేయని సాహసోపేతమైన, విప్లవాత్మకమైన నిర్ణయాలను తీసుకుని అర్హతే ప్రామాణికంగా కుల, మత, వర్గ,రాజకీయాలకు అతీతంగా పేద, బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వం సంక్షేమ ఫలాలను అందించి విమర్శలకు తావులేకుండా సుపరిపాలన అంది స్తున్న సంగతిని వివరించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతను ఈ ముఖ్యమంత్రి ఇస్తున్నారని తెలిపారు. పేద ప్రజల పట్ల మనసు పెట్టి ఆలోచన చేసేవారే నిజమైన నాయకులని, అ కోవలోకి ఈ ప్రభుత్వం వస్తుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో 10 మంది వైద్యులు, 105 రకాల మందులను ఉచితంగా ప్రభుత్వం అంది స్తుందని అన్నారు. ఇంటి వద్దకే వైద్య ద్ని పంపి అవసరమైన శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారని తెలిపారు. పరిశ్రమ లు తీసుకురావాలనే 4 పోర్టులు, 9 హార్బర్లు ఏర్పాటు కాబోతున్నాయని, విశాఖలో రూ.15వేల కోట్లతో ఇన్ఫోసిస్, ఫార్మా కంపెనీలు ఏర్పాటు, రామా యపట్నం వద్ద రూ.45 వేల కోట్లతో సోలార్ ప్రాజెక్ట్ వంటివి రాబోతు న్నాయని, దీంతో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనుందని అన్నారు. ఉద్దానం కిడ్నీ బాధితుల కోసం పలాసలో కిడ్నీ ఆసుపత్రితో పాటు స్వచ్ఛమైన తాగునీటిని అందించే కార్యక్రమం, ఈ పూరిలోనే ఒక మెడికల్ కాలేజీ, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి రాబోతున్న సంగతిని ఆయన గుర్తుచేశారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ ప్రజలు మెచ్చే పరిపాలనను సుపరిపాలన అంటారని తెలిపారు. పేద, బడుగు, అట్టడుగు, బలహీన వర్గాలతో పాటు అందరికీ సంక్షేమ ఫలాలను పారదర్శకంగా అందిస్తున్న ఏకైక ప్రభుత్వం ఇదని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ రూరల్ పీపుల్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరెక్టర్ పి.కె.ప్రకాష్ అధ్యక్షత వహించిన ఈ సదస్సులో జిల్లా ఉద్యానవన అధికారి గిరిజ, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ షణ్ముఖరాజు, మునిసిపల్ వైస్ చైర్మన్ గునేష్, మండల అధ్యక్షురాలు శోభారాణి, మండల విద్యాశాఖాధికారి ఎస్. సింహాచలం, ఉపాధ్యాయులు తిరుపతిరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొండగుళ్ళు దేవాలయానికి జోరుగా సుందరీకరణ పనులు

- రూ. 8లక్షలు సమకూర్చిన దాతలు
- చొరవచూపిన కరకవలస వైసీపీ నేత దుల్ల అప్పన్న

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని చామలాపల్లి, గుడివాడ, కరకవలస గ్రామాల మధ్యలోగల కొండగుళ్ళు శ్రీఉమా బ్రహ్మలింగేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణ సుందరీ కరణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ పురాతన దేవాలయ అభివృద్ధిని దేవదాయ ధర్మాదాయ అధికారులు గాని పాలకులు గాని పెద్దగా పట్టించుకోకపోవడంతో క్రమేణా భక్తుల ఆదరణ కూడా తగ్గిపోతోంది. ఈ విషయాన్ని గ్రహించిన కరకవలస గ్రామానికి చెందిన వైసీపీ నేత దుల్ల అప్పన్న, ఆయన తనయుడు దుల్ల దివాకర్ తదితరులు ఆలయాన్ని అభివృద్ధి చేసే సంకల్పంతో ముందడుగు వేశారు. కొంత సొంత సొమ్మును వెచ్చించడమే కాకుండా కొంతమంది దాతల సహకారాన్ని ఆర్జించారు. సుమారు 8లక్షల రూపాయలను సేకరించి ఆలయ సుందరీ కరణ పనులకు శ్రీకారం చుట్టారు.ప్రధాన ఆలయానికి ప్లాస్టింగ్ పనులు, పెయింటింగ్ పనులకు అన్నీ సిద్ధం చేసారు. అలాగే విద్యుద్దీకరణ, వైరింగ్ పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయ దిగువ భాగంలో గల కోనేరును కూడా సుందరీకరించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు కోనేరుకు రెండు పక్కల మట్టి రోడ్డును విస్తరీకరించారు. కోనేరు గట్టు చుట్టూ విద్యుత్ దీపాలను అమర్చారు. అలాగే కోనేరు చుట్టూ గట్టు పాడవకుండా రాళ్లు పేర్చడం, మట్టి రోడ్డుపై సీసీ రోడ్డు వేసే పనులకు త్వరలో శ్రీకారం చుట్టానున్నామని వైసీపీ నేత దుల్ల అప్పన్న తెలిపారు.ఆలయ దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం త్రాగునీటి కొళాయిని కూడా కొండపై ఏర్పాటు చేయనున్నామ్మన్నారు. ఈ పనులన్నీ పూర్తి చేస్తే కొండగుళ్లకు పూర్వ వైభవం వస్తుందని, ఆలయ అభివృద్ధికి కంకణం కట్టుకున్న వైసీపీ నేతలు దుల్ల అప్పన్న, దుల్ల దివాకర్ లను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

ప్రజాదరణ చూసి ఓర్వ లేకనే తప్పుడు కేసులు, అరెస్టులు

- చంద్రబాబును తక్షణం విడుదల చేయాలి
- ఈ కక్ష సాధింపు రాజకీయలు ఇంకెన్నాళ్ళు!
- మండిపడుతున్న తెలుగుతమ్ముళ్లు

విశాలాంధ్ర-వంగర : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కి పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకనే చంద్రబాబు నాయుడు, టీడీపీ నాయకులపై వైసీపీ సర్కార్ తప్పుడు కేసులతో జైల్లో పెట్టిస్తున్నారని టీడీపీ నాయకులు మండిపడ్డారు. మాజీ ఏఎంసీ మాజీ చైర్మెన్, టీడీపీ సీనియర్ నాయకులు పైల వెంకట రమణ, రాజాం నియోజకవర్గ టీడీపీ బీసీసెల్ ఉపాధ్యక్షులు గంట పద్మ, సీనియర్ దేశం నాయకులు మాజీ మండల పార్టీ టీడీపీ అధ్యక్షులు బెజ్జిపురపు త్రినాదులు, లెంక సింహాలు, గంటెడ అప్పలనాయుడు మండిపడ్డారు. జగన్ చేస్తున్న అక్రమాలకు, దోపిడీ విధానాలు, దౌర్జన్య పాలన, అభివృద్ధి నిరోధకుడైన జగన్ రెడ్డి ప్రభుత్వం పై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని వారు ధ్వజమెత్తారు. రాష్ట్రంలోఇలాంటి పాలన కు ప్రజలు విసిగి ప్రజల్లోతిరుగు బాటు మొదలైందని వారు తీవ్ర విమర్శలు గుప్పించారు.రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓటమి బయతో తప్పులు చేయని, 14 ఏల్లుచేసి అన్నిరంగా ల్లో అభివృద్ధి చేసిన ఆయన్ను, జగన్ రెడ్డి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపట్టి రాజకీయంగాఎదుర్కొనే దమ్ము లేక అధికారులను అడ్డుపెట్టుకొని నీతి, నిజాయతీకి మారుపేరైన మా నాయకుడు చంద్రబాబు నాయుడు ను పై అక్రమకేసులు, అరెస్టులు వైసీపీ ప్రభుత్వం చేయిస్తుందనివారు మండిపడ్డారు. నీతి, నిజాయతీపరులు రాష్ట్ర అభివృద్ధి ప్రదాత, చంద్రబాబు, తెలుగు దేశం పార్టీ వారి పై అక్రమంగా వేధింపులకు పాల్పడుకేసులు, బెదిరింపులతో ఎన్నాళ్ళిలా రాజకీయాలు చేస్తారని వీరు జగన్ రెడ్డి పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో చంద్ర బాబు నాయుడు,నారాలోకేస్ తదితరులు పర్యటిస్తున్నప్పుడు వస్తున్న జనాలు తెలుగు దేశం పార్టీకి పెరుగు తున్న జనాదరణ చూసి, ఓటమి భయం తో వైసీపీ ప్రభుత్వం జగన్ రెడ్డికి భయం పట్టుకుందన్నారు, దీంతో ఎటువంటి తప్పు చేయని,మచ్చలేని మణిహారం పై,అధికార దాహంతో,జగన్ మోచేతి నీళ్లు తాగుతున్న అధికారులతో తప్పుడు కేసులు బనాయిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రాన్ని జగన్ రెడ్డి పూర్తిగా నాశనం చేశారని ఆరోపించారు. పరిపాలన చేత కాని ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని అదోగతి పాల్జేశారని, ఎక్కడా రోడ్లు కానీ, ఎటువంటి అభివృద్ధి చేయలేదని అన్నారు. రాష్ట్రంలో రోడ్లు లేవు, పరిశ్రమలు లేవు వీటిని కేంద్రం మీదకి తోశాడనీ, పోలవరం ప్రాజెక్టు ను పూర్తిచేయలేక కేంద్ర మీదకితోసేస్తున్నాడని ధ్వజమెత్తారు. ఇప్పుడొచ్చి ఇంకోసారి ఓట్ వెయ్యండి నెనేంటో చూపిస్తా అంటున్నాడనీ అవన్నీ దోపిడీ, దొంగ నాటకాల నీ వారు విరుచుకుపడ్డారు. చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ ఏ ఒక్క ఆధారం లేకుండా ఆయనను 40 రోజులుగా జైల్లో ఉంచారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలు,విద్యార్థులు, నిరుద్యోగులు,తగిన బుద్ది చెప్తారని వ్యాఖ్యానించారు. అక్రమంగా అరెస్ట్ చేసిన చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం శాఖా గ్రంథాలయం లో పిల్లల కు దసరా సెలవుల సందర్భం గా గురువారం నాడు క్రీడలు పోటీలు నిర్వహించడం జరిగింది.ఈ క్రీడలు మానసిక ఉల్లాసం కలిగిస్తాయి అని స్థానిక గ్రంథాలయ అధికారి సి.హెచ్ కృష్ణ మూర్తి తెలిపారు.విద్యార్థులకు మానసిక ఉల్లాసానికి శరీర దారుఢ్యం కొరకు క్రీడలు దోహద పడతాయి.క్రీడలు రెండు బ్యాచ్ లకు మ్యూజికల్ చైర్ ఆటలు ఆడించడం అయింది.దీనిలో పిల్లలకు పద్యములు చెప్పడం మరియు చదివించడం జరిగింది.ఈ కార్యక్రమానికి 14 మంది పిల్లలు పాల్గొన్నారు.

విద్యారంగంలో సంస్కరణలు అభినందనీయం

ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు సామల

విశాలాంధ్ర-పార్వతీపురం: ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ ఆధ్వర్యంలో, ఐఆర్పీడబ్ల్యూఏ సంస్థ నిర్వహణలో గురువారం పార్వతీపురం లయన్స్ క్లబ్ లో అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్- పాలనా సంస్కరణలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు.ఈసదస్సులో బలిజిపేట ఎంఈవో, పార్వతీపురం మన్యంజిల్లా ఎంఈవోల సంఘంఅధ్యక్షుడు సామల సింహాచలంపాల్గొని ప్రసంగించారు.సామల మాట్లాడుతూ విద్యారంగంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అనేక విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారని అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం అమలు చేయడం వల్ల నిరుపేద వర్గాలకు చెందిన విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలిగిందన్నారు. మనబడి నాడునేడు పథకం ద్వారా పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక సౌకర్యాలు కల్పించారని,ఐ ఎఫ్ పి ల ద్వారా, ట్యాబ్స్ పంపిణీ చేయడం ద్వారా డిజిటల్ ఎడ్యుకేషన్ ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ఇటీవల రాష్ట్రం నుండి ఐక్య రాజ్య సమితి కి విద్యార్థుల బృందం వెళ్లి, అక్కడ ప్రసంగించి రావడం గొప్ప విషయమని కొనియాడారు. విద్యారంగ అభివృద్ధిలో ఎంఈఓలు భాగస్వామ్యం వహించి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు మెమరీ టెక్నిక్స్ పై శిక్షణ



విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగవరపుకోట శాఖా గ్రంధాలయం లో దసరా సెలవులు సందర్భముగా "చదవడం-మాకిష్టం" కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆంగ్ల అధ్యాపకులు పి జి.ఆర్. మోహనరావు ఆధ్వర్యంలో మెమొరీ టెక్నిక్స్ పై శిక్షణ ఇచ్చారని లైబ్రేరియన్ దామోదర శ్రీధర్ గురువారం తెలిపారు. అనంతరం విద్యార్థుల మధ్య చదరంగం, క్యారం బోర్డ్, ఇతర ఆటలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 22 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలుపడే విధంగా చర్యలు చేపట్టాలి

నేర సమీక్షలో జిల్లా ఎస్పీ దీపిక, ఐపిఎస్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: జిల్లా పోలీసు అధికారులతో మాసాంతర నేర సమీక్షా సమావేశాన్ని జిల్లా ఎస్పీ ఎం. దీపిక గురువారంజిల్లా పోలీసు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీఎం.దీపిక మాట్లాడుతూ - పోక్సో కేసుల్లో నిందితులకు శిక్షలుపడే విధంగా దర్యాప్తు చేయాలని, సాంకేతిక ఆధారాలను, సాక్షాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. పోక్సో కేసుల్లో దర్యాప్తును క్షుణ్ణంగా చేయాలని, అవసరమైన కేసుల్లో బాధితులకు కౌన్సిలింగు నిర్వహించాలన్నారు. వివిధ పోలీసు స్టేషనుల్లో రౌడీ షీటర్లుపై నమోదైన కేసుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఆయా కేసులను ప్రాధాన్యత కేసుల జాబితాల్లో చేర్చి, నిందితులుగా ఉన్న రౌడీ షీటర్లుకు న్యాయస్థానాల్లో శిక్షలు పడే విధంగా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ రోజూ విజిబుల్ పోలీసింగు చేపట్టాని, ఎం.వి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఈ-చలానాలు విధించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపైనా, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. వైట్ కాలర్ నేరాలైన చీటింగు, నమ్మకద్రోహం కేసుల్లో దర్యాప్తు కుణ్ణంగా చేపట్టాలని, మోసాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. దొంగతనాలు జరగకుండా రాత్రి పెట్రోలింగు, గస్తీని ముమ్మరం చేయాలని, ఎ.టి.ఎం. కేంద్రాలను తరుచూ తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. దివాళీ పండగ వస్తున్న నేపథ్యంలో మందుగుండు విక్రయించే వ్యాపారులను నిబంధనలు పాటించే విధంగా బైండోవరు చేయాలని, అక్రమ మందుగుండు విక్రయ, తయారీదారులపై కేసులు నమోదు చేయాలన్నారు. దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను జిల్లా ఎస్పీ సమీక్షించి, ఆయా కేసుల్లో దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత దర్యాప్తు అధికారులకు జిల్లా ఎస్పీ ఎం. దీపిక దిశా నిర్దేశం చేసారు. ప్రతిభ కనబర్చిన అధికారులకు ప్రశంసా పత్రాలను అందజేసిన జిల్లా ఎస్పీ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనలో భద్రత విధులను సమర్ధవంతంగా నిర్వహించిన 2వ పట్టణ సిఐ ఎస్.హెచ్. విజయ ఆనంద్, ఎస్ఐ షేక్ శంకర్, రాజాం చోరీ కేసును చేధించుటలో సమర్ధవంతంగా పని చేసిన రాజాం ఎస్ఐ వై. రవికిరణ్, అగ్ని ప్రమాదానికి గురైన ప్రైవేటు బస్సులో ప్రయాణికులను సకాలంలో స్పందించి రక్షించిన ట్రాఫిక్ ఎస్ఐ ఎ.ఎం. రాజు, హెచ్.జి. సిహెచ్.వెంకటరావు, అగ్నివీర్ బందోబస్తును సమర్ధవంతంగా నిర్వహించిన ఆర్.ఎస్.ఐ. ఎ.రామకృష్ణ, వివిధ కేసులను చేధించుటలోను, వివిధ పోలీసు విధులను సమర్ధవతంగా నిర్వహించిన 2వ పట్టణ హెచ్.సి. టి.వి.ఆర్.కే.వి.ప్రసాద్, కానిస్టేబుళ్ళు ఎం. వాసు, ఎం.గణేష్, బొబ్బిలి కానిస్టేబుళ్ళు జి. శశిభూష ణరావు, పి.లక్ష్మణరావు, తెర్లాం కానిస్టేబులు ఎస్. ఢిల్లీశ్వరరావు, గజపతి నగరం కానిస్టేబుళ్ళు పి.

సత్యన్నారాయణ, ఎస్. శ్రీహరి, ఎస్పీ కానిస్టేబులు జె.జయకృష్ణ, రాజాం కానిస్టేబుళ్ళు ఎస్. సత్యంనాయుడు, కే. సూరపు నాయుడు, హెచ్.జి. కే. రాజేంద్ర లను ఎస్పీ ఎం.దీపిక అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేసారు.ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, సెబ్ అదనపు ఎస్పీ ఎన్.వెంకటరావు, విజయనగరం డిఎస్పీ ఆర్.గోవిందరావు, బొబ్బిలి డిఎస్పీ పి. శ్రీధర్, ట్రాఫిక్ డిఎస్పీ డి. విశ్వనాథ్, న్యాయ సలహాదారులు వై.పరశురాం, డిసిఆర్బి సిఐ జె.మురళి, ఎస్పీ సిఐలు కే.కే.వి. విజయనాథ్, ఈ. నర్సింహమూర్తి, 1వ పట్టణ సిఐ బి. వెంకటరావు, 2వ పట్టణ సిఐ విజయ ఆనంద్, రూరల్ సిఐ టి.వి. తిరుపతిరావు, దిశ సిఐ బి. నాగేశ్వరరావు, రాజాం రూరల్ సిఐ ఎస్.శ్రీనివాస్, గజపతినగరం సిఐ ఎల్. అప్పలనాయుడు, సిసిఎస్ ఎం. బుచ్చిరాజు, బొబ్బిలి రూరల్ సిఐ ఎస్.తిరుమల రావు, భోగాపురం సిఐ వెంకటేశ్వరరావు, కంట్రోల్ రూం సిఐ రాజశేఖర్, ఎస్.కోట సిఐ బాల సూర్యారావు, వివిధ పోలీసు స్టేషనుల్లో పని చేస్తున్న ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాటు సారా స్వాధీనం ఇద్దరు అరెస్ట్, మరో వ్యక్తిపై కేసు

ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ ఉపేంద్ర

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: జిల్లా సూపరిం టెండెంట్ ఆఫ్ పోలీస్ విక్రాంత్ పాటిల్, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ దిలీప్ కిరణ్ ఆదేశాల మేరకు ఒడిషా రాష్ట్రం అలమండ నుండి ఆంధ్రా ప్రాంతానికి నాటు సారా రవాణా జరుగుతుందన్న సమాచారం తో పార్వతీపురం మండలం రంగాలగుడ గ్రామ సమీపంలో మాటు వేసి 880 లీటర్ల నాటుసారాతో పాటు ఇన్నోవా కారును సీజ్ చేసి కొమరాడ మండలం పూడేసు గ్రామానికి చెందిన ఆరిక నరేష్ అలియాస్ వరుణ్ మరియు పార్వతీపురంకు చెందిన సిరిపురపు నారాయణను అదుపులోకి తీసుకుని అరెస్టు చేయడం జరిగిందని ఎన్ఫోర్స్మెంట్ సీఐ ఎల్ ఉపేంద్ర తెలిపారు. నాటు సారా సరఫరాదారుడు ఒడిషా రాష్ట్రం ఆలమండ గ్రామానికి చెందిన బెవరా శరత్ పై వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలపడమైనదన్నారు. సదరు ఇద్దరు వ్యక్తులను రిమాండ్ కు తరలిస్తునట్లు తెలిపారు. ఈ దాడుల్లో యస్ఐ వి.వి.రమణ,హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాకు విచ్చేసిన నార్కోటిక్స్ ట్రాకింగ్ డాగ్ మ్యాక్స్

విశాలాంధ్ర-పార్వతీపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసుశాఖ ఇంటిలిజెన్సు సెక్యూరిటీ విభాగం ఆధర్యంలో మంగళగిరి సిటిసి శిక్షణకేంద్రంలో తొమ్మిది మాసాల శిక్షణఅనంతరం పార్వతీ పురం మన్యం జిల్లాకు కేటాయించిన నార్కోటిక్స్ ట్రాకింగ్ డాగ్ "మ్యాక్స్" గురువారం విధుల్లో చేరింది.డాగ్స్ హ్యాండ్లర్స్ జిల్లా కేంద్రంకు చేరుకొని, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ను మర్యాద పూర్వకంగా కలిసారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మ్యాక్స్ కి స్వాగతం పలికి తొమ్మిది మాసాల శిక్షణ తీరును, "మాక్స్" ఆరోగ్యం, శిక్షణ నైపుణ్యం ను అడిగి తెలుసుకున్నారు. 9మాసాల శిక్షణలో జిల్లాకు చెందిన డాగ్ హ్యాండ్లర్ కె.రామారావు ఎచ్ సి-1095, స్పేర్ హ్యాండ్లర్ వి.బలరాం పిసి-2122 లను డాగ్ 'మాక్స్' ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, క్రమానుగుణంగా వైద్య పరీక్షలు నిర్వహించాలని డాగ్ హ్యాండ్లర్సు జిల్లా ఎస్పీ సూచించారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టరు ఒ .దిలీప్ కిరణ్, రిజర్వు ఇన్స్పెక్టరు కుమార్సిబ్బంది పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ సేవలు అవసరం

జిల్లా మేనేజ్మెంట్ కమిటీ సభ్యుడు సూర్యారావు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థలు సేవలు ఈ ప్రాంతానికి చాలా అవసరమని ఆ సంస్థ జిల్లా మేనేజ్మెంట్ కమిటీ సభ్యుడు డి.సూర్యారావు అన్నారు. ఎస్.కోట ఎన్జీవో కార్యాలయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సబ్ బ్రాంచి ఏర్పాటు నిమిత్తం తహశీల్దార్ డి. శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యారావు మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భారతదేశంలో మానవ జీవితము, ఆరోగ్యాన్ని రక్షించడానికి.. విపత్తుల నుండి కాపాడడానికి, వివక్షతను దూరం చేయడానికి ఏర్పడిన ఒక గొప్ప మానవతా సంస్థని కొనియాడారు. ఈ ప్రాంతంలో గిరిజన గ్రామాలు, వెనుక బడిన గ్రామాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాంతానికి సంస్థ సేవలు అవసరం ఎంతైనా ఉన్నదన్నారు.

డిస్ట్రిక్ట్ సబ్ బ్రాంచ్ చైర్మన్ గా డాక్టర్ పి.వరలక్ష్మి

ఎస్.కోట మండలం చైర్మన్ గా డాక్టర్ పొట్నూరు వరలక్ష్మి, వైస్ చైర్మన్ గా ఏ.మల్లేశ్వరరావు, కోశాధికారిగా శ్రీనాథ్ వెంకన్నబాబు, అలాగే కార్యదర్శిగా జి.ధనుంజయ, మేనేజ్మెంట్ కమిటీ మెంబర్లుగా డాక్టర్ ఎం.వేణు, డాక్టర్ వివిఎస్ అప్పలనాయుడు,ఎం.కొండలరావు, ఆర్.దుర్గాప్రసాద్, కే.అప్పలరాజు, కెవి జోగారావు, వానపల్లి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తదనంతరం తహశీల్దార్ డి.శ్రీనివాసరావుని సంస్థ సభ్యులు దుస్సాలులతో ఘనంగా సన్మానించి పండ్ల మొక్కలు అందించారు. ఈ కార్యక్రమానికి సంస్థ పాటర్న్ సభ్యులు, లైఫ్ మెంబర్లు, అభిమానులు జిల్లా కోఆర్డినేటర్ గౌరేష్ ,మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

అనర్హులను తొలగించి అర్హులకు పట్టాలివ్వండి

ఉత్తరాంధ్ర జిల్లాల మాలమహానాడు అధ్యక్షులు గొల్ల

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామంలో అనర్హులను తొలగించి అర్హులకు ఇళ్ల పట్టాలివ్వాలని ఉత్తరాంధ్ర జిల్లాల మాలమహానాడు అధ్యక్షులు గొల్ల ఈశ్వరరావు డిమాండ్ చేస్తూ తహసీల్దార్ ప్రసన్నకుమార్ కు గురువారం వినతిపత్రం సమర్పించారు.నిజానికి గ్రామంలోని 25దూదేకుల కుటుంబాలకు గత ప్రభుత్వ హయాంలో పట్టాలిచ్చారని వారిలో 15మంది మాత్రమే అర్హులు న్నారన్నారు. మిగిలిన 10మందికి గతంలో ఇల్లులు ఇచ్చారని వారు అర్హులు కాదని రికార్డులు కూడా చెబుతున్నాయన్నారు. అయినప్పటికీ గ్రామం లో వైస్సార్ పార్టీకి చెందిన ఒక నాయకుడు చేతివాటం చూపుతూ అనర్హులను అర్హులుగా చూపే ప్రయత్నం చేస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కున్నారు. అలాగే గ్రామంలో 14ఎస్సీ కుటుంబాలకు ఇంతవరకు ఇల్లులు గాని పట్టాలు గాని ఇవ్వలేదన్నారు. గ్రామంలోని సర్వే నెంబర్ 105/3లో స్థలం ఉన్నందున అనర్హులైన 10మంది దూదేకులకు ఇచ్చిన ఇళ్లపట్టాలను తొలగించి అర్హులైన ఎస్సీలకు ఇవ్వాలన్నారు. ఈ మేరకు గ్రామంలోని ఇళ్ల పట్టా లబ్ధిదారుల విచారణ జరిపి అర్హులైన ఎస్సీలకు న్యాయం చేయాలని గొల్ల ఈశ్వరరావు కోరారు.ఈ మేరకు స్పందించిన తహసీల్దార్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన ఇళ్లపట్టాలు, లబ్ధిదారులపై విచారణ జరిపి నిజమని తేలితే పట్టాలు రద్దు చేస్తామన్నారు. అలాగే అర్హులైన ఎస్సీలకు కూడా ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు సిఫారసు చేస్తామన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి మాదాసు చారింద్ర, బొద్దాం ఎస్సీ మహిళలు పాల్గొన్నారు.

బీజెపిని బలోపేతం చేయడమే లక్ష్యం

విశాలాంధ్ర-గజపతినగరం: బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులు దంతివాడ అప్పలాచారి గురువారం గజపతినగరం విచ్చేసి నియోజకవర్గం లో వెనుకబడిన తరగతుల నాయకులను నియమించడమే ఈ పర్యటన లక్ష్యం అని తెలిపారు అత్యధిక సంఖ్యకులైన వెనుకబడిన తరగతుల ముఖ్య నాయకులైన నియోజకవర్గ కన్వీనర్ మరియు జిల్లా ఉపాధ్యక్షులు దేవర ఈశ్వరరావు అధ్యక్షతన ఆయన మాట్లాడుతూ జిల్లాలో పూర్తిస్థాయిలో పార్టీని బలోపేతం చేసి భవిష్యత్తులో బిజెపి విజయానికి శ్రీకారం చుడతామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఆరిశెట్టి ఏడుకొండలు బోడి రామకృష్ణ జిల్లా కిషన్ మోర్చా ఉపాధ్యక్షులు కొరటాల రామారావు మజ్జి నారాయణ రాజు బూడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సర్పంచ్ భార్య మృతి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : గొట్లాం నుండి చెల్లూరు వెళ్లే బైపాస్ రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దత్తరాజేరు మండలం కన్నం గ్రామ సర్పంచ్ చుక్క సన్యాసిరావు భార్య చుక్క సరస్వతి(55) మృతి చెందింది. భార్యభర్తలు ఇద్దరు రైంద్రం గ్రామంలో జరిగిన ఓ శుభ కార్యానికి విశాఖపట్నం కారులో వెళుతుండగా కోరాడపేట బ్రిడ్జి వద్ద గడ్డితో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో సరస్వతి సంఘటన స్థలంలోని మృతి చెందింది. సర్పంచ్ సన్యాసిరావు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విజయనగరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

22న మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఈనెల 22వ తేదీన నగరంలో ఉన్న అన్ని స్వచ్ఛంద రక్తదాన శిబిరాల నిర్వహకులతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్ పేర్కొన్నారు ఈ మేరకు స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు అన్ని దానాల కన్నా రక్తదానం మిన్న అని అన్నారు. అందువల్ల స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పైడితలమ్మ జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని స్వచ్ఛంద సంస్థలు,రక్తదాన శిబిరాల నిర్వహకులు ఆధ్వర్యంలో 22వ తేదీన స్థానిక చాసో స్మారక భవనంలో మెగా రక్త దాన శిబిరాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆరోజు ఉదయం వాక్ ఫర్ విజయనగరం పేరుతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కావున ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని, రక్తాన్ని దానమిచ్చి ప్రాణదాతలుగా మారాలని కోరారు. ఈ సమావేశంలో కార్యక్రమ నిర్వహకులు పద్మనాభం,ప్రవీణ్ అంచాలయా, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

జెఎఎస్‌ను తనిఖీచేసిన డిఐఓ

విశాలాంధ్ర-కొమరాడ/ బెలగాం: కొమరాడ మండలం చినఖేర్జల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి. జగన్మోహనరావు గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంత మందికి వైద్య సేవలు అందజేశారు, సర్వేలో ఇచ్చిన టోకెన్లు, ప్రతీ కౌంటర్ వద్ద ప్రజలకు అందజేసిన వైద్య సేవల వివరాలు, ఎటువంటి ఆరోగ్య సమస్యలతో ఎక్కువగా వచ్చారు తదితర అంశాలపై సిబ్బందిని ఆరా తీశారు. ఒపి నమోదు వివరాలు రికార్డులో పరిశీలించారు. పలు ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారిలో ఆయా రోగాల వారీగా ఎంతమంది వైద్య సేవలు వినియోగించున్నారని అడిగారు. ముఖ్యంగా జెఎఎస్ లో ఆరోగ్య తనిఖీల్లో కొత్తగా గుర్తించిన బిపి, మధుమేహం, రక్తహీనత గల కిశోర బాలికలు, కఫం పరీక్షల ద్వారా కొత్తగా నమోదైన క్షయ వ్యాధిగ్రస్తులు, కళ్ళ తనిఖీలకు వచ్చినవారిలో కేటరాక్ట్ ఆపరేషన్లకు ఎంత మందిని గుర్తించారు, కళ్ళ జోళ్లు ఎంతమందికి అవసరమయ్యాయి, రిఫరల్ అవసరమైన వారిని పర్యవేక్షణ, కొత్తగా గుర్తించిన లెప్రసీ లక్షణాలు ఉన్నవారు, పిల్లలు, గర్భిణీలో ఎంతమందిని పోషకాహార లోపం, హై రిస్క్ ఉన్నవారిని గుర్తించారు అడిగి రికార్డులో పరిశీలించారు. అనంతరం అంగన్వాడీ స్టాల్ ను పరిశీలించి ఎంతమంది గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం. మల్లిఖార్జునరావు, వైద్యాధికారి సిహెచ్. అరుణ్ కుమార్, సర్పంచ్ హెచ్. గంగారావు, వైస్ సర్పంచ్ పి. ప్రసాద్, స్పెషలిస్ట్ వైద్యులు, పంచాయతీ సెక్రటరీ టి. వెంకటరమణ, సూపర్ వైజర్లు విజయకుమారి, జయగౌడ్ వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నివారణకై కృషి చేయాలి

విశాలాంధ్ర-బొబ్బిలి: సమాజంలో బాల్య వివాహాలు నివారించి బాలిక లను విద్యావంతులుగా ఎదిగేందుకు సమాజం లో ప్రతి ఒకరు బాధ్యతగా చేయూత నం దించాలని బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్షులు జె సి రాజు పిలుపునిచ్చారు.గురువారం స్థానిక ఓ ట్రవేట్ డిగ్రీ కాలేజీలో రోటరీ క్లబ్ కార్యదర్శి శ్రీహరి ఆధ్వర్యంలో బాలికలు- బాల్యవివాహాలు- నష్టాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యానర్ ప్రదర్శన చేశారు. అనంతరం జె సి రాజు మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని బాల్యవివాహాలు చేసిన ప్రోత్సహించిన అది నేరమని అందుకు శిక్షార్హులు అవుతారని అన్నారు. తల్లితండ్రులు బాల్య వివాహాలు వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కలిగి బాలికలను చదివించాలన్నారు బాల్య వివాహాలు సామాజిక నేరమని ,అవి బాలికల ఎదుగుదలకు ,అభివృద్ధికి అవరోదాలని సమాజం గుర్తించాలని అన్నారు హాజరైన బాలికలచే బాల్యవివాహాలు నిరోధానికి కృషి చేస్తామని ప్రతిన చేశారు. బాల్య వివాహాలు వల్ల సంభవించే అనర్థాలను హాజరైన బాలికలు మాట్లాడారు

ప్రతిభ కనబరిచిన ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు ప్రత్యేక నగదు బహుమతులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శృంగవరపుకోట ఆర్టీసీ డిపో పరిధిలో ప్రతిభ కనబరిచిన కండక్టర్లు, డ్రైవర్లకు జిల్లా ప్రజా రవాణా అధికారి సి.హెచ్.అప్పలనారాయణ అభినందించి ప్రత్యేక నగదు బహుమతులను గురువారం సాయంత్రం అందజేశారు. అన్ని సెక్షన్లను తనిఖీ చేసి డిపో అభివృద్ధికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. విధులలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కండక్టర్లు బి.వి.రమణ, వి.ఎస్.రావు, కె.ఇ.రావు, డ్రైవర్లు కె.ఎల్. బి.శాస్త్రి, జి.ఇ.రావు, ఎస్.ఆర్.వి.రాజు తదితరులకి నగదు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు. ఈ సభలో సభ్యులనుద్దేశించి మేనేజింగ్ డైరెక్టర్ సందేశాన్ని వెల్లడించారు. డిపో మేనేజర్ కె. రమేష్ ఆధ్వర్యంలో జరిగిన సభలో అసిస్టెంట్ మేనేజర్ సి.హెచ్.కృష్ణా రావు, స్థానిక సూపరింటెండెంట్ వెంకటరావు, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్టక్టర్ వేణు, గ్యారేజ్, ట్రాఫిక్, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా హజరత్ ఖాదర్ బాబా 127వ జన్మదినోత్సవం

విశాలాంధ్ర -విజయ నగరం టౌన్ : సూఫీ మహా చక్రవర్తి హజరత్ సయ్యద్ ఖాదర్ వలీ(ర.అ.) బాబా వారి 127వ జన్మ దిన వేడుకలు గురువారం బాబామెట్ట ఖాదర్ బాబా దర్గా, దర్బార్ షరీఫ్ లో అత్యంత ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు హజరత్ ముహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా వారి సూఫీ వారసులు, చీమలపాడు దర్గా దర్బార్ షరీఫ్ పీఠాధిపతి మొహమ్మద్ ఖ్వాజా మొహియినుద్దీన్ తాజ్ ఖాదరీ ముఖ్యఅతిధులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా దర్బార్ నుంచి పకీర్ ఖవ్వాలి, మేళ తాళాలు మధ్య ఊరేగింపుగా ఖాదర్ బాబా దర్గా కి వెళ్లి, ఖాదర్ బాబా దర్గాలో బాబా వారికి చాదర్, సుగంధ తైలాలు సమర్పించి పూలాభిషేకం చేశారు. అనంతరం విశ్వశాంతి కోసం ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

వర్షాభావం తగ్గిన కారణంగా తగిన జాగ్రత్తలు పాటించాలి..

విశాలాంధ్ర-కురుపాం: వివిధ పంటలు కీలక దశలో ఉన్న సమయంలో వర్షాభావం తగ్గినందున రైతులు కృషీవిజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ సూచనలు తప్పనిసరిగా పాటిస్తూ అధిక దిగుబడులు పొందాలని కెవికె ప్రోగ్రాం అదికారి డా టిఎస్ఎస్ కె పాత్రో ,అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ నిర్మలాజ్యోతి రైతులకు సూచించారు. గురువారం మండలం లోని వివిధ గ్రామాల్లో మండల వ్యవసాయ అదికారి నాగేశ్వరరావు ఆద్వర్యంలో వరి ,ప్రత్తి పంటల క్షేత్ర స్థాయి సందర్శన చేపట్టారు. వరిపంట కీలక దశ పొట్ట కట్టే సమయం అయినందున 2శాతం యూరియా ద్రావణాన్ని పిచికారీ చెయ్యాలని, అలాగే పత్తి కి ఒక శాతం యూరియా ద్రావణాన్ని పిచికారీ చేసీ అధిక దిగుబడి పొందాలని సూచించారు.

ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకం : కోలగట్ల

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : నగరంలోని 3వ డివిజన్ పూల్ బాగ్, వాడ వీధి జంక్షన్ నుండి ప్రారంభమైన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. వాడవీధి చేరుకున్న ఆయనకు స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాల బుక్లెట్లను అందజేశారు. స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని ఇల్లలకు ఇంటి పన్ను విధించలేదని స్థానికులు చెప్పడంతో అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా మేయరు విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు,ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును తెలుసుకునేందుకు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం చక్కటి వేదికగా నిలుస్తుందన్నారు. వాడవీధిలో ప్రతి ఇంటికి ఏదో ఒక రూపంలో ప్రభుత్వ పథకం అందరంతో స్థానికులు ఆనందమయిందన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ ప్రసాదరావు, స్థానిక కార్పొరేటర్ వజ్రపు సత్య గౌరీ, వైసిపి నాయకులు మెండా రమణ, వజ్రపు శ్రీను, వేమూరి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జమ్ము పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరిచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించి అమలుచేస్తోందని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీ రాముల నాయుడు తెలిపారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ శిబిరంలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య వివరాలను తెలుసుకొని నమోదు చేసు కుంటే మంచిదని సూచించారు. గురువారం జమ్ము పాఠశాలలో ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అవసరమైన వారికి శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేయాలని అక్కడున్న వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సచివాలయాల పరిధిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డా. సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

31న అమరుల సంస్మరణ దినం నాడు కార్యకర్తల శిక్షణా శిబిరం

విశాలాంధ్ర-బెలగాం : అక్టోబర్ 31న అమరుల సంస్మరణ దినం నాడు కార్యకర్తల శిక్షణా శిబిరాన్ని జయప్రదం చేయాలని కోరుతూ పార్వతీపురం మండలం చినమరికి పంచాయతీ శివందొర వలస గ్రామంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా అధ్యక్షులు పి.సంగం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 31, నవంబర్ 1 రెండు రోజులు బెలగాం రైతు బజార్ సమీపంలో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో జరిగే శిక్షణా శిబిరాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ విప్లవోద్యమం ఎచ్చటదని అడిగితే శ్రీకాకుళం వైపు చూడమని చెప్పాలని, వెంపటాపు సత్యం ఎవరని అడిగినా గిరిజనుల గుండెలను గుర్తుగా చూపాలన్నారు. ఆంధ్రదేశంలో విప్లవోద్యమాన్ని రగిలించి పార్లమెంటరీ అవకాశవాదం పై చావు దెబ్బ కొట్టిన శ్రీకాకుళ గిరిజన రైతాంగ ఉద్యమంలో తొలి అమరులు కామ్రేడ్ కోరన్న మంగన్న ఉద్యమానికి నాయకత్వం వహించిన కామ్రేడ్ వెంపటాపు సత్యం, ఆదిభట్ల కైలాసం, పంచాది కృష్ణమూర్తిలతో సహా ఆ ఉద్యమంలో అమరులైన వీరులందరికీ సిపిఐ ఎంఎల్ లిబరేషన్ వినమ్రంగా లాల్ సలాంలు తెలుపుతుందన్నారు. ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, ఈ శిబిరాన్ని జయప్రదం చేయాలని కోరుతున్నామన్నారు. స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు పూర్తయిన గిరిజనుల పరిస్థితి ఎక్కడవేసిన గొంగళి అక్కడే ఉందన్నారు. అదేవిధంగా నాన్ సెడ్యూల్డ్ గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ గ్రామాలుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు మెల్లిక చిన్నారావు, నిమ్మక సూరన్న, కద్రక ప్రమీల, కొండగొర్రి శశిరేఖ, గంటా చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

నలుగురు అరెస్టు

విశాలాంధ్ర-బలిజిపేట: మండలం లోని వేర్వేరు ప్రాంతా ల్లో అక్రమంగా మద్యం సీసాలు తరలి స్తున్న నలుగురు వ్యక్తుల ను పట్టుకొని వారి నుండి 350మద్యం సీసాలు పట్టుకు న్నట్లు ఎస్ఐ ఎన్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఎస్బి పోలీసులతో పాటు స్థానిక పోలీసులు కలిసి అక్రమంగా మద్యం తరలిస్తున్న సమయంలో పట్టుకొని వారిని అరెస్టుచేసి రెండు కేసులు నమోదు చేశామని తెలిపారు.

జగనన్న చేదోడు నాలుగవ విడత నిధులు పంపిణీ

విశాలాంధ్ర-పార్వతీపురం/బెలగాం : కలెక్టరు కార్యాలయంలో జరిగిన జగనన్న చేదోడు నాలుగవ విడత నిధులు పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారులు ఉత్సాహం గా పాల్గొన్నారు. 2023-24 ఆర్థిక సం.కి 2,969 రజకులకు 2.969 కోట్లరూపాయలు, 1,090 నాయీ బ్రాహ్మణులకు 1.090 కోట్ల రూపాయలు, 5,463 టైలరింగు వృత్తి లబ్ధిదారులకు 5.463 కోట్లరూపాయల చొప్పున మొత్తం 9,522 మంది లబ్దిదారులకు 9.522 కోట్ల రూపాయలు నిధులు పంపిణీ చేసారు. కార్యక్రమంలో పాల్గొన్న లబ్దిదారులు తమయొక్క అభిప్రాయాలను తెలియజేసారు. నియోజకవర్గవారీగా పార్వతీపురం నియోజకవర్గంలో 1,139 రజకులకు 1.139 కోట్లరూపాయలు, 448 నాయీ బ్రాహ్మణులకు 0.448 కోట్ల రూపాయలు, 2,263 టైలరింగు వృత్తి లబ్దిదారులకు 2.263 కోట్లరూపాయల చొప్పున మొత్తం 3,856 మంది లబ్దదారులకు 3.856 కోట్ల రూపాయలను, కురుపాం నియోజకవర్గం లో 743 రజకులకు 0.743 కోట్ల రూపాయలు, 245 నాయీ బ్రాహ్మణులకు 0.245 కోట్ల రూపాయలు, 1444 టైలరింగు వృత్తి లబ్దిదారులకు 1.444 కోట్ల రూపాయల చొప్పున మొత్తం 2,432 మంది లబ్దిదారులకు 2.432 కోట్ల రూపాయలను, సాలూరు నియోజకవర్గం లో 677 మంది రజకులకు 0.677 కోట్లరూపాయలు, 212 నాయీ బ్రాహ్మణులకు 0.212 కోట్ల రూపాయలు, 1,080 టైలరింగు వృత్తి లబ్దిదారులకు 1.080 కోట్లరూపాయల చొప్పున మొత్తం1,969 మంది లబ్దిదారులకు 1.969 కోట్లరూపాయలను, పాలకొండ నియోజకవర్గంలో 410 రజకులకు 0.410 కోట్లరూపాయలు, 185 నాయీ బ్రాహ్మణులకు 0.185 కోట్ల రూపాయలు, 670 టైలరింగు వృత్తి లబ్దిదారులకు 0.670కోట్లరూపాయల చొప్పున మొత్తం 1265 మంది లబ్దిదారులకు 1.265 కోట్ల రూపాయలను పంపిణీ చేసారు. ఇప్పటివరకు జిల్లాలో 2020-21 ఆర్ధిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడతలో 2,707 రజకులకు 270.70 లక్షల రూపాయలు, 1,066 నాయీ బ్రాహ్మణులకు 106.60 లక్షల రూపాయలు, 3,392 టైలరింగు వృత్తి లబ్దిదారులకు 339.20 లక్షల రూపాయల చొప్పున మొత్తం 7,165 మంది లబ్దిదారులకు 716.50 లక్షల రూపాయలు, 2021-22 ఆర్ధిక సంవత్సరానికి సంబంధించి 2వ విడతలో 2523 రజకులకు 252.30 లక్షల రూపాయలు, 993 నాయీ బ్రాహ్మణులకు 99.30 లక్షల రూపాయలు, 3,330 టైలరింగు వృత్తి లబ్దిదారులకు 333.00 లక్షల రూపాయల చొప్పున మొత్తం 6,846 మంది లబ్దిదారులకు 684.60 లక్షల రూపాయలు, 2022-23 ఆర్ధిక సంవత్సరానికి సంబంధించి 3వ విడతలో 3,036 రజకులకు 303.60 లక్షల రూపాయలు, 1,150 నాయీ బ్రాహ్మణులకు 115.00 లక్షల రూపాయలు, 4,007 టైలరింగు వృత్తి లబ్దిదారులకు 400.70 లక్షల రూపాయల చొప్పున మొత్తం 8,193 మంది లబ్దిదారులకు 819.30 లక్షల రూపాయల చొప్పున వెరశి 3విడతలలో 8,266 రజకులకు 826.60 లక్షల రూపాయలు, 3,209 నాయీ బ్రాహ్మణులకు 320.90 లక్షల రూపాయలు, 10,729 టైలరింగు వృత్తి లబ్దిదారులకు 1072.90 లక్షల రూపాయల చొప్పున మొత్తం 22,204 మంది లబ్దిదారులకు 2,220.40 లక్షల రూపాయలు పంపిణీ చేయడం జరిగింది.

ప్రాణాలైనా అర్పిస్తాం. ఒపిఎస్ ను సాధిస్తాం.....

ఓట్ ఫర్ ఒపిఎస్ అనే నినాదంతో ముందుకు వెళ్తాం

సిపిఎస్, జిపిఎస్ ను రద్దు చేయాలని యుటిఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-బెలగాం: సిపిఎస్, జిపిఎస్ ను రద్దు చేయాలనే డిమాండ్ తో యుటిఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు పార్వతీపురం మన్యం జిల్లా యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా సహధ్యక్షులు కె. విజయ్ కుమార్ అధ్యక్షతన జిల్లా కలక్టరు కార్యాలయం వద్ద గురువారం రిలే నిరవధిక నిరహార దీక్షలు ఆమరణ దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉద్యోగ, కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రాణాలైనా అర్పిస్తాం, ఒపిఎస్ ను సాధిస్తామని తెలిపారు. వచ్చే ఎన్నికలలో ఓట్ ఫర్ ఒపిఎస్ అనే నినాదంతో ముందుకు వెళ్తామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వారం రోజులలో సిపిఎస్ రద్దు చేసి, ఒపిఎస్ ను తీసుకువస్తానని చెప్పిన జగన్మోహన రెడ్డి మాట తప్పి, మడమ తిప్పి జిపిఎస్ ను తీసుకురావడమంటే ఉపాధ్యాయులను, ఉద్యోగులను మోసం చేయడమేనన్నారు. ఈ నిరవదిక నిరహార దీక్షల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు ఏమైనా జరిగితే ప్రభుత్వమే భాధ్యత వహించాలని నాయకులు అన్నారు. రాబోయే ఎన్నికలు ఒపిఎస్ చుట్టూ తిరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమానికి టిడిపి ఇంచార్జి బోనెల విజయచంద్ర సిపిఎం పార్టీ నాయకులు ఎం. కృష్ణమూర్తి, రెడ్డి వేణు మద్దతు పలికారు. జెఎసి నాయకులు కిశోర్, హెచ్ఎం సంఘ నాయకులు పిసిహెచ్ శ్రీనివాసరావు, ఎపిటిఎఫ్ 1938 కూర్మినాయుడు, ఎస్ఎపి నాయకులు గోవింద్, పిఈటి సంఘం నాయకులు మురళీ, విఆర్ఓ సంఘ నాయకులు సింహాచలం, పెన్షనర్ల సంఘ నాయకులు జగన్నాథం, మనోహార్ బాయి, ప్రముఖ కవి గంటేడ గౌరినాయుడు, సిఐటియు నాయకులు మన్మధరావు, క్లాస్-4, కోఆపరేటివ్ సంఘ నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. దీక్షల్లో జిల్లా అధ్యక్షులు టి. రమేష్, ప్రధాన కార్యదర్శి ఎన్. మురళీమోహన్ రావు, రాష్ట్ర కౌన్సిలర్ ఐ. రాజమణి, సిపిఎస్ కన్వీనర్ ఎం. శంకర్రావు, కో-కన్వీనర్ పి. సుధ తదితరులు పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దుకై యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరవధిక నిరాహార దీక్ష

దీక్షలను ప్రారంభించిన జె ఏ సి చైర్మన్ మురళి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పాత పెన్షన్ విధానం పునరుద్దరించాలని, సిపిఎస్, జిపిఎస్ ను రద్దు చేయాలని,కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో నెంబర్ 57 ప్రకారం డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేయాలనిలి కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలను ఎపి జె ఏ సి జిల్లా చైర్మన్ జె.మురళి దీక్షలో కూర్చున్నవారికి పూల దండలు వేసి ప్రారంభించారు. దీక్షలను ఉద్దేశించి జె ఏ సి చైర్మన్ జె.మురళి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఓపిఎస్ అమలులో ఉద్యోగులను మోసం చేశారన్నారు. 2004లో పెన్షన్ విధానం రద్దు చేసినప్పటి నుండి దేశవ్యాపితంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళన చేస్తున్నారని, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో గత నాలుగైదు సంవత్సరాలుగా ఉద్యమం సమరశీలంగా నడుస్తున్నదన్నారు.. రాష్ట్ర ముఖ్యమంత్రి సిపిఎస్‌ను రద్దుచేస్తానని గత ఎన్నికల్లో హామీనిచ్చారని, ముఖ్య మంత్రి మోసపూరిత ప్రకటనలు చేయడం బాధ్యతారాహిత్యమన్నారు. సిపిఎస్ రద్దుకు చేస్తున్న పోరాటం న్యాయమైనదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానం పునరుద్దరించాలని, ఈ ఆందోళనకు అన్ని సంఘాలు మద్దతు తెలపాలన్నారు. అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు,రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి, డి.రాము, కే.శ్రీనివాసరావు,జిల్లా అధ్యక్ష, కార్య దర్శులు రమేష్ చంద్ర పట్నా యక్, జెఏ విఆర్ కె ఈశ్వరరావు లు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి మాట ఇచ్చి మర్చిపోయారన్నారు. అధికారంలోకి వచ్చిన వారం రోజులు లో సి పీ ఎస్ ను రద్దు చేస్తాం అని చెప్పి ఐదేళ్లు అవుతున్నా రద్దు చేయకుండా జి పి ఎస్ పేరుతో ఉద్యోగులను నమ్మించి మోసం చేశారన్నారు. లక్షలు మంది ఉద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నా ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. నిరవధిక దీక్ష లో యు టి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు,రాష్ట్ర నాయకులు కె.విజయాగౌరి, డి.రాము, రాష్ట్ర కౌన్సిలర్ కె.శ్రీనివాసరావు,జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జె.రమేష్ చంద్ర పట్నాయక్, జె ఏ వి ఆర్ కె ఈశ్వరరావు, సిహెచ్ తిరుపతి నాయుడు, యుటిఎఫ్ సిపిఎస్ జిల్లా కన్వీనర్ పి.రామ్ ప్రసాద్ లు కూర్చున్నారు. వారికి మద్దతుగా అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.